సోమవారం
15-08-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 55
పేజీలు : 10, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam
www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23

అక్షరాక్షరం అభ్యుదయం

స్థాపితం 1952 విశాలాంధ్ర 70 అక్షరాక్షరం అభ్యుదయం

నెహ్రూ మీద మళ్లీ
బీజేపీ బురద

- కమ్యూనిస్టులపైనా విషం
- కుటిల యత్నాలను దుయ్యబట్టిన జైరాంరమేశ్



న్యూఢిల్లీ:
కేంద్రంలో నరేంద్ర మోదీ అధికారంలోకి వచ్చిన తరవాత గణతంత్ర దినోత్సవానికి తోడు నవంబరు 26న రాజ్యాంగ దినోత్సవం జరుపుతున్నారు. 2015 నుంచి ఈ పద్ధతి మొదలైంది. అంతకు ముందు దీన్ని శాసన దినోత్సవం అనే వారు. ఆ తరువాత గత సంవత్సరం నుంచి స్వాతంత్ర్య దినానికి ఒక్క రోజు ముందు అంటే ఆగస్టు 14న "దేశ విభజన ఘోరాల దినం"గా నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది ఈ దివసం సందర్భంగా మోదీ ప్రభుత్వం ఒక వీడియో తయారు చేసింది. ఈ వీడియోలో దేశ విభజనకు దారి తీసిన పరిస్థితులను బీజేపీ దృష్టితో చూపించారు. ఈ వీడియో తయారు చేయడానికి పాత వీడియోలనే వాడుకున్నా వాటిని అమర్చిన తీరు, నేపథ్యంలో చేసిన వ్యాఖ్యానం బీజేపీ ఊహలకు అనువుగా రూపొందించారు. పాకిస్తాన్ ఏర్పాటు చేయాలన్న మహమ్మద్ అలి జిన్నా

- మిగతా 2 లో

స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో
స్టీల్‌ప్లాంట్‌ను
కాపాడుకుంటాం

- కార్మిక సంఘాలే శాశ్వతం... మోదీ కాదు
- ఉక్కు దీక్షలు 550 రోజుల సందర్భంగా జాతీయ జెండాలతో భారీ ప్రదర్శన
- 36 గంటల ఉక్కు సత్యాగ్రహ దీక్ష ప్రారంభం

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం :
దేశవ్యాప్తంగా అజాదీ కా అమృత మహోత్సవం జరుపుకుంటున్న వేళ ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం కార్మిక వర్గం జాతీయ ఉద్యమ స్ఫూర్తితో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తోందని విశాఖ ఉక్కు పోరాట కార్మిక నేతలు తెలిపారు. కార్మిక సంఘాలు శాశ్వతంగా ఉంటాయని, మోదీ శాశ్వతం కాదని వారు స్పష్టం చేశారు. ఆదివారం జోరు వర్షంలో కూడా విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ 550 రోజుల పోరాట దీక్ష సందర్భంగా ప్రజాసంఘాల అధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం జగదాంబ జంక్షన్ నుంచి జిల్లా కోర్టు మీదుగా జీవీఎంసీ దీక్షా శిబిరం వద్దకు జాతీయ జెండాలతో భారీ ఎత్తున ప్రదర్శన జరిగింది. ప్రదర్శన ముందు భాగాన ఆశా కార్మికుల కోలాటం, ప్రజానాట్యమండలి కళాకారులు తీన్‌మార్ డప్పులు ప్రజలను ఆకట్టుకున్నాయి. జాతీయ జెండాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. దేశ సమగ్రత, జాతీయత కాపాడడం అంటే మోదీ ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ సంస్థలకు అమ్మడమా? అని నేతలు

- మిగతా 2 లో

పాఠకులకు, ప్రకటనకర్తలకు, ఏజెంట్లకు, శ్రేయోభిలాషులకు
విశాలాంధ్ర
75వ స్వాతంత్ర్యదినోత్సవ శుభాకాంక్షలు
జనరల్ మేనేజర్

డీఎస్సీ జాప్యం

3 ఏళ్లుగా జగన్ సర్కారు నిర్లక్ష్యం

- వయసు మీరుతున్న అభ్యర్థులు
- లక్ష మందికి 'అనర్హత' ముప్పు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం మూడేళ్ల నుంచి లక్షలాది మంది శిక్షణ పొందిన ఉపాధ్యాయ అభ్యర్థులు(ఛాత్రోపాధ్యాయులు) ఎదురు చూస్తున్నప్పటికీ, జగన్ సర్కారు స్పందించడం లేదు. జగన్ ప్రభుత్వం మూడేళ్ల తర్వాత టెట్ పరీక్షలు నిర్వహించి, డీఎస్సీపై మౌనంగా ఉంది. వైసీపీ మేనిఫెస్టోలో యేటా 10వేల మందితో మెగా డీఎస్సీ నిర్వహిస్తామని పొందుపరిచారు. ఆ పార్టీ అధికారంలోకి వచ్చి, మూడేళ్లవుతున్నప్పటికీ, ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేదు. ఇప్పటికే టెట్‌లో అర్హత సాధించి, డీఎస్సీ కోసం దాదాపు ఏడు లక్షల మంది వరకు ఎదురు చూస్తున్నారు. ఏపీ టెట్-2022 పరీక్షలకు 5.50లక్షల మంది దరఖాస్తు చేశారు. డీఎస్సీ ద్వారా నియామకాలు చేపట్టనందున ఉపాధ్యాయ శిక్షణ కోర్సులు చేయడానికి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. బీఈడీ, డీఎడ్, భాషా

- మిగతా 2 లో

స్వాతంత్ర్య వేడుకలకు
సర్వం సిద్ధం

- నేడు ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహణ
- మువ్వన్నెల జెండాలతో ముస్తాబు
- జెండా ఎగురవేయనున్న జగన్

2 లో

అనేక రంగాల్లో
భారత్ పురోగతి

- 2047 నాటికి స్వాతంత్ర్య సమరయోధుల కలల సాకారం
- రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తొలి ప్రసంగం

2 లో

ధన-కండబలంతో
ఎన్నికల సమగ్రతకు ముప్పు

- నిష్పాక్షిక ఎన్నికలకు - నమ్మకమైన ఓటింగ్ యంత్రాలు
- 11 విపక్షాల సదస్సు తీర్మానాలు

న్యూఢిల్లీ :
ధనబలం, కండబలం వల్ల భారత ఎన్నికల సమగ్రతకు ముప్పు ఉందని ప్రధాన ప్రతిపక్షాలు నేతలు ఉద్ఘాటించారు. ఎన్నికల ప్రక్రియ నిష్పాక్షికంగా సాగాలని నొక్కిచెప్పారు. మెరుగైన ఎన్నికల విధానం, మరింత నమ్మకమైన ఓటింగ్ యంత్రాలు అవసరమని సూచించారు. ఎలక్టోరల్ బాండ్ల పథకాన్ని రద్దు చేయాలని అన్నారు. నకిలీ వార్తల కట్టడిలో

- మిగతా 2 లో

కరువు కోరల్లో యూరప్ - ఎండిన థేమ్స్

500 ఏళ్ల తర్వాత దారుణ పరిస్థితులు

లండన్ : ఇంగ్లండ్‌లో ఎన్నడూ లేని విధంగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఎండల ధాటికి అక్కడి ప్రభుత్వం అత్యవసర పరిస్థితిని ప్రకటించింది. లండన్‌లోని హీత్రూ ప్రాంతంలో 40డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రత నమోదు అయింది. దీంతో ప్రఖ్యాత థేమ్స్ నది దాని మూలం ఎండిపోతోంది. యూరప్ కరువు కోరల్లో చిక్కుకుంది. 500 ఏళ్లలో లేనంత దారుణ పరిస్థితులను చవిచూస్తోంది. వాతావరణం పొడిబడటం, వర్షాలు లేకపోవడంతో థేమ్స్‌లో నీడి జాడలేకుండా పోయింది. దీంతో ఇంగ్లండ్‌లో కరువు పరిస్థితి నెలకొంటోంది. జూలైలో అత్యంత పొడి వాతావరణంతో పాటు సగటు వర్షపాతం 23.1 మిల్లీమీటర్ల నమోదు అయింది. థేమ్స్ నది తూర్పున ఎసెక్స్ వద్ద సముద్రంలోకి ప్రవేశించే ముందు పశ్చిమాన గ్లౌసెస్టర్ షైర్ నుంచి లండన్ మీదుగా 356 కిలోమీటర్లు ప్రవహిస్తుంది. ఈ నది పుట్టుకకు కారణం అయిన సహజ నీటి బుగ్గలు ఈ వేసవిలో ఎండిపోయాయి. దీంతో నదీ ప్రవాహం తగ్గింది. థేమ్స్ నది ఇంగ్లాండ్, లండన్ ప్రజలకు మంచి నీటి సరఫరాకు ముఖ్యమైంది. 1.5 కోట్ల జనాభా దీనిపై ఆధారపడి ఉన్నారు. ఇదే పరిస్థితి ఉంటే వేసవిలో ఇబ్బందులు తప్పవని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

కోలుకుంటున్న రష్దీ-వెంటిలేటర్ తొలగింపు



మేవిల్లే : ప్రఖ్యాత రచయిత సల్మాన్ రష్దీ కోలుకుంటున్నారని సన్నిహిత వర్గాలు తెలిపాయి. వెంటిలేటర్‌ను వైద్యులు తొలగించగా ఆయన మాట్లాడగలుగుతున్నట్లు వెల్లడించారు. సల్మాన్‌రష్దీపై దాడి తీవ్రస్థాయిలో జరిగిందని, కేవలం 20 సెకన్ల వ్యవధిలో దాదాపు 10-15కత్తిపోట్లు పడ్డాయన్నారు. రష్దీ సహ-రచయిత అతీశ్ తసీర్ ట్విట్టర్ మాధ్యంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని వెల్లడించారు. రష్దీ మాట్లాడుతున్నట్లు పేర్కొన్నారు. రష్దీ ఏజెంటు ఆండ్రూ వీలి కూడా ఇదే విషయాన్ని తెలిపారు.

నేను నిర్దోషిని : నిందితుడు

సల్మాన్ రష్దీపై దాడి చేసినందుకు అరెస్టుకు గురైన హాది మాటర్ (24) తాను నిర్దోషినని కోర్టులో చెప్పారు. తాను హత్యాయత్నం చేయలేదన్నారు. నేరం రుజువు కావాల్సి ఉండగా ఇదంతా పక్కా ప్రణాళికతో చేసినదిగా ప్రాసిక్యూషన్ వాదించింది.

జేకే రోలింగ్‌కూ బెదిరింపులు..

సల్మాన్ రష్దీ తర్వాత మీ వంతు అంటూ హారీపాటర్ రచయిత్రి జేకే రోలింగ్‌కు బెదిరింపులు వచ్చాయి.

రష్దీపై దాడిని ఆమె ట్విట్టర్ వేదికగా ఖండించారు. ఈ వార్త తనను కలచివేసిందని పేర్కొన్నారు. ఈమె ట్వీట్‌పై వచ్చిన స్పందనల్లో 'ఆందోళన చెందకండి.. తర్వాత మీ వంతే' అని ఒకరు బెదిరించడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. రష్దీపై దాడి చేసిన వ్యక్తిపై ప్రశంసలు కురిపించి, అతనిని షియా విప్లవయోధుడిగా అభివర్ణించాడు. తనకు వచ్చిన బెదిరింపులను పోలీసులు పరిశీలిస్తున్నట్లు రోలింగ్ ఓ ట్వీట్‌లో తెలిపారు. తనకు మద్దతుగా నిలిచిన అందరికీ కృతజ్ఞతలు చెబుతూ ట్వీట్‌చేశారు.

స్వాతంత్ర్య వేడుకలకు సర్వం సిద్ధం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: స్వాతంత్ర్య వేడులకు ప్రజానీకం సర్వం సిద్ధమైంది. మువ్వన్నెల జెండాలను తమ ఇళ్లపై ముందస్తుగానే ఎగురవేసి, వేడుకల్లో భాగస్వాములయ్యేందుకు ఎదురుచూస్తున్నారు. విద్యార్థులు, యువత, రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు వేడుకలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. స్వాతంత్ర్య వేడుకల నిర్వహణకు విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. సీఎం జగన్ సోమవారం జాతీయ జెండా ఎగురవేస్తారు. అనంతరం సాయుధ దళాల నుంచి ఆయన గౌరవ వందనం స్వీకరిస్తారు. రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి సీఎం ప్రసంగిస్తారు. ప్రదర్శన కోసం వివిధ శాఖలకు చెందిన శకటాలను సిద్ధం చేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్టేడియాన్ని మువ్వన్నెల జెండాలతో ముస్తాబు చేశారు. స్టేడియానికి వెళ్లే ప్రధాన మార్గాలను, లోపల వివిధ విభాగాలను మువ్వన్నెల జెండాలతో అలంకరించారు. కార్యక్రమం అనంతరం సాయంత్రం ఐదున్నర గంటలకు రాజ్‌భవన్‌లో గవర్నర్ ఇచ్చే తేనీటి విందుకు సీఎం హాజరవుతారు. వేడుకలను పురస్కరించుకుని తాడేపల్లిలో సీఎం ఇంటి వద్ద భారీ జెండా ఏర్పాటు చేశారు. విజయవాడలో సీపీఐ ప్రదర్శన... హాజరుకానున్న రామకృష్ణ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం ఉదయం 10.30 గంటలకు విజయవాడలో సీపీఐ ప్రదర్శన నిర్వహించనుంది. లెనిన్ సెంటరు నుంచి దాసరి భవన్ వరకు మువ్వన్నెల జెండాలతో సీపీఐ శ్రేణులు ప్రదర్శన నిర్వహిస్తారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పాల్గొంటారు. దాసరి భవన్ వద్ద జాతీయ పతాకాన్ని ఎగురవేసి పార్టీ శ్రేణులకు ఆయన సందేశమిస్తారు. సీపీఎం, వైసీపీ, కాంగ్రెస్, బీజేపీ, జనసేన రాష్ట్ర కార్యాలయాల్లో స్వాతంత్ర్య వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు.

బందరురోడ్డులో ట్రాఫిక్ ఆంక్షలు: స్వాతంత్ర్య వేడుకలను దృష్టిలో ఉంచుకుని బందరురోడ్డులో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వాహనాలను దారిమళ్లించేందుకు పోలీసు యంత్రాంగం నిమగ్నమైంది. బందరురోడ్డు నుంచి ప్రయాణించే ప్రజలను ఇతర మార్గాల ద్వారా గమ్యస్థానాలకు చేరుకోవాలని పోలీసుశాఖ సూచించింది. ఉదయం 9 గంటలకు వేడుకలు ప్రారంభం కానున్న దృష్ట్యా ఆహ్వానితులు, పాస్‌లు ఉన్న వారంతా ఉదయం 7.45కే సభా ప్రాంగణంలో తమకు కేటాయించిన సీట్లలో కూర్చోవాలని అధికారులు కోరారు. గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, సీఎం జగన్, మంత్రులు, ప్రజాప్రతినిధులు, వీఐపీల రాకతో ఆయా ప్రాంతాల్లో పోలీసులు గట్టి బందోబస్తు చేపట్టారు. ఇందిరాగాంధీ స్టేడియాన్ని తమ స్వాధీనంలోకి తీసుకున్నారు.

ఎన్నికల సమగ్రతకు ముప్పు

(మొదటిపేజీ తరువాయి)

భారత ఎన్నికల సంఘం విఫలమైందని దుయ్యబట్టారు. ఈ అన్ని అంశాలపై పౌర సామాజిక సంఘాలు చేసిన అనేక తీర్మానాలకు 11 ప్రతిపక్ష పార్టీల ఆమోదం లభించింది. పదవీ విరమణ పొందిన ప్రభుత్వ అధికారులు, జన సరోకర్, పీపుల్ ఫస్ట్‌కు చెందిన కానిస్టిట్యూషనల్ కాండక్ట్ గ్రూపు ఆధ్వర్యంలో సదస్సులో కాంగ్రెస్, ఎన్సీపీ, సీపీఐ, సీపీఎం, బీఎస్పీ, ఎస్పీ, ఆర్జేడీ, ఆర్‌ఎల్పీ, టీఆర్‌ఎస్, సమాజ్ ఇండియా, వేల్ఫేర్ పార్టీ ఆఫ్ ఇండియా మద్దతు ఉన్న జమాతే ఇస్లామీ హింద్‌కు చెందిన కీలక నేతలు పాల్గొన్నారు. 'యంత్రం (ఈవీఎం), ధనం, మీడియా బలం'పై పోరు తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించారు. ఓటింగ్ ప్రక్రియను రీ -డిజైన్ చేయాలని, ఏదేని సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్‌పై ఆధారం లేకుండా స్వతంత్ర విధానం కావాలని సూచించారు. ఓటు చెల్లుబాటు అయ్యేందుకుగాను వీలుగా చిప్ రహిత బాలెట్ బాక్స్‌లో వీవీప్యాట్ స్లిప్‌ను ఓటరు వేసేలా సౌకర్యం ఉండాలన్నారు. కనీసం ఐదేళ్ల వరకు వీవీప్యాట్ స్లిప్పులను నిల్వచేసేలా దానిపై ముద్రణ ఉండాలన్నారు. ఎలాంటి యంత్రాలు, ఈవీఎంలు, వీవీప్యాట్‌లను వినియోగించినగానీ ఎన్నికల ఫలితాలు సరైనవిగా ఉండాలని తీర్మానించారు. రిస్క్-లిమిటెడ్ ఆడిట్ల ద్వారా ఓటింగ్ ప్రణాళికలు రూపొందించాలని, మరిన్ని అవకాశాల కోసం ఈసీఐ అన్వేషించాలని పేర్కొన్నారు. 'రాజ్యసభలో ద్రవ్య బిల్లు ఆమోదానికి మార్గం సుగమం చేసేలా ఎలక్టోరల్ బాండ్లను ప్రభుత్వం తీసుకు వచ్చిందని, అవి అపారదర్శతను పెంచాయని, ఎన్నికల రాజకీయాల్లో ధనానికి పెద్దపాత్ర కల్పించాయని, అందుకే ఎన్నికల బాండ్ల పథకాన్ని నిలిపివేయాలని నేతలు తీర్మానించారు. కాగా, సదస్సులో పాల్గొన్న నేతల్లో మధ్యప్రదేశ్ మాజీ సీఎం దిగ్విజయ్ సింగ్ (కాంగ్రెస్), మహారాష్ట్ర మాజీ మంత్రి జితేంద్ర అవహద్ (ఎన్సీపీ), సీపీఐ, సీపీఎం ప్రధాన కార్యదర్శులు డి.రాజా, సీతారాం ఏచూరి, బీఎస్పీ ఎంపీ దానిశ్ అలీ, ఎస్పీ నేత ఘన్‌శ్యాం తివారీ, ఆర్జేడీ నేత నవల్ కిశోర్, ఆర్ఎల్‌డీ నేత మైరాజ్ ఉద్దీన్ అహ్మద్, టీఆర్‌ఎస్ ఎంపీ కేఆర్ సురేశ్ రెడ్డి, సమాజ్ ఇండియా నేత యోగేంద్ర యాదవ్, డబ్ల్యూపీఐ జాతీయ అధ్యక్షుడు ఎస్‌క్యూఆర్ ఇలియాస్ ఉన్నారు. తీర్మానాలను ప్రవేశపెట్టిన పౌర సామాజిక సంఘాల సభ్యులలో మాజీ రాయబారి దేబ్ ముఖర్జి, మాజీ ఐఏఎస్‌లు ఎంజీ దేవసహాయం, అరుణా రాయ్, ఐఐటీ దిల్లీ ప్రొఫెసర్ సుభాసిస్ బెనర్జీ, ప్రజల సమాచర హక్కు జాతీయ ఉద్యమ కో-కన్వీనర్ అంజలీ భరద్వాజ్, సీనియర్ జర్నలిస్టు పామెలా ఫిలిపోస్ ఉన్నారు.

నెహ్రూ మీద మళ్లీ బీజేపీ బురద

(మొదటిపేజీ తరువాయి)

డిమాండును పండిత్ నెహ్రూ ఆమోదించారని తెలిపారు. ఆ రకంగా దేశ విభజన ఘోరాల దివసాన్ని కూడా నెహ్రూ మీద దుమ్మెత్తి పోయాడానికి వాటంగా ఉపయోగించుకున్నారు. అప్పుడు దేశ విభజన భౌగోళికంగా ఖరారు చేసే బాధ్యతను సిరిల్ జాన్ రాడ్ క్లిఫ్‌కు అప్పగించారు. "ఆయనకు భారత సంస్కృతి, నాగరికత, విలువలు, యాత్రా స్థలాల గురించి తెలియదు. ఆయన మూడు వారాల్లో భౌగోళిక సరిహద్దులను ఖరారు చేయడానికి అనుమతించారు" అని ఈ వీడియోలో తెలియజేశారు. "ఇదంతా జరుగుతున్నప్పుడు విచ్ఛిన్నకర శక్తులను నిలవరించవలసిన బాధ్యత ఉన్న వారు ఎక్కడున్నారు?" అని ఈ వీడియోతో పాటు ట్విట్టర్‌లో బీజేపీ వ్యాఖ్యానించింది. దేశ విభజన ఓ విషాదం. అసలు ఆ రోజును గుర్తు చేసుకోవడానికి ఒక దివసాన్ని నిర్వహించడంలో బీజేపీ ఆంతర్యం ఏమిటో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. భారత్, పాకిస్తాన్ మత ప్రాతిపదికమీద విడిపోయాయి కనక తమ ముస్లిం వ్యతిరేక ప్రచారానికి ఈ దివస్ నిర్వహించాలని నిర్ణయించారు. ఆ దుర్దినాన్ని పురస్కరించుకుని విద్వేషం నింపాలని బీజేపీ ప్రయత్నిస్తోంది. కాంగ్రెస్ నాయకుడు జై రాం రమేశ్ ఈ కుటిల ప్రయత్నాలను తీవ్రంగానే దుయ్యబట్టారు. "ద్విజాతి సిద్ధాంతాన్ని ప్రతిపాదించింది వీర సావర్కర్. దానికి పదును పెట్టింది మహమ్మద్ అలీ జిన్నా" అని గుర్తు చేశారు. "పాకిస్తాన్ ఏర్పాటుకు అంగీకరించకుండా ఉంటే దేశం ముక్క చెక్కలై పూర్తిగా నాశనమయ్యేది" అని సర్దార్ పటేల్ రాసిన మాటలను కూడా జై రాం రమేశ్ గుర్తు చేశారు. రాడ్ క్లిఫ్ నిర్ణయించిన భౌగోళిక సరిహద్దుల ప్రకారం పశ్చిమాన పంజాబ్, తూర్పున బెంగాల్ నిలువునా చీలి పోయాయి. బెంగాల్ విభజనకు మద్దతు ఇచ్చింది డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ. ఆయనే ఆ తరవాత భారతీయ జనసంఘ్ స్థాపించారు. బీజేపీ వీడియోలో పనిలో పనిగా దేశ విభజనకు కమ్యూనిస్టులూ బాధ్యతే అని దుమ్మెత్తి పోశారు. ఈ వీడియ నిండా నెహ్రూ, జిన్నా ఉన్న దృశ్యాలే ఎక్కువగా కనిపిస్తాయి. కానీ వాటిని బీజేపీ దుష్ప్రచారానికి అనువుగా మర్చారు.

నవంబరులో ఆగ్నేయాసియాకు జిన్‌పింగ్

బైడెన్‌తో భేటీకి అవకాశం

బీజింగ్ : చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ నవంబరులో ఆగ్నేయాసియాలో పర్యటిస్తారు. కోవిడ్ విజృంభణ అనంతరం ఆయన తొలిసారి విదేశాల్లో పర్యటించనున్నారు. ఇండోనేసియాలో జీ20 శిఖరాగ్ర సమావేశాలకు జిన్‌పింగ్ హాజరుకానున్నారు. ఆగ్నేయాసిలో అమెరికా అధ్యక్షుడు బైడెన్‌తో పాటు ఇంకొందరు దేశాధినేతలతో జిన్‌పింగ్ భేటీ కానున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. బైడెన్, జిన్‌పింగ్ గతనెల 28న దాదాపు రెండుగంటలకుపైగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చర్చలు జరిపారు. తైవాన్ విషయంలో ఇరు దేశాల మధ్య ఘర్షణ క్రమంలో తాజా భేటీ ప్రాధాన్యతను సంతరించుకుంది.

విశాలాంధ్ర ప్రపంచం

మోంటెనెగ్రోలో కాల్పులు.. 11 మంది మృతి..

మోంటెనెగ్రో : ఆగ్నేయ యూరప్‌లోని మోంటెనెగ్రోలోని సెటింజే నగరం కాల్పుల ఘటనతో ఉలిక్కిపడింది. విచక్షణ కోల్పోయిన ఓ వ్యక్తి 11 మందిని కాల్చిచంపాడు. ఒక పోలీసుతో సహా ఆరుగురికి తీవ్రంగా గాయాలయ్యాయని, ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని పోలీసులు తెలిపారు. రాజధాని పోడ్గోరికాకు పశ్చిమాన 22 మైళ్ల దూరంలో ఉన్న సెటింజేలో కుటుంబ కలహం ఈ దారుణానికి దారితీసిందని వెల్లడించించారు. మృతుల్లో ఇద్దరు చిన్నారులు ఉన్నారన్నారు. స్థానికుడి సహకారంతో దుండగుడిని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై అధ్యక్షుడు మిలో దుకనోవిక్ దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. మృతులకు సంతాపాన్ని వారి కుటుంబాలకు సానుభూతిని ప్రకటించారు.

అనేక రంగాల్లో భారత్ పురోగతి

న్యూదిల్లీ : భారత దేశం అనేక రంగాల్లో పురోగతి సాధిస్తోందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. భారత స్వాతంత్రానికి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా జాతినుద్దేశించి ఆమె తొలిసారిగా ప్రసంగించారు. దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. భారత్‌లో లింగ వివక్ష తగ్గుముఖం పట్టిందని, ఆడబిడ్డలు అన్ని రంగాల్లో సాధికారత సాధిస్తున్నారని అన్నారు. సమాజంలో అసమానతలు కొనసాగుతున్నాయని రాష్ట్రపతి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామిక నిజమైన సామర్థ్యాన్ని కనుగొనడంలో ప్రపంచానికి భారత్ సాయపడిందన్నారు. అవసరార్థులు, అణగారిన వర్గాల పట్ల భారత్ సానుభూతిని కలిగి ఉంటుందని అన్నారు. నవంబరు 15వ తేదీని 'జనజాతీయ గౌరవ్ దివస్'గా పాటించాలన్న నిర్ణయం స్వాగతించదగినన్నారు. మన గిరిజన వీరులు స్థానిక / ప్రాంతీయ చిహ్నాలు మాత్రమే కాదు.. యావత్ దేశానికి స్ఫూర్తిప్రదాతలు అని ముర్ము కొనియాడారు. 2021, మార్చిలో దండి మార్చ్‌ను మళ్లీ అమలు చేయడంతో 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'ని ప్రారంభించుకున్నామని ఆమె అన్నారు. విదేశీ దాస్యశృంఖలాలను తెంచుకుని స్వాతంత్ర్యం సాధించుకున్నామని ద్రౌపది ముర్ము అన్నారు. రోజురోజుకు ప్రజాస్వామ్యం బలోపేతం అవుతున్నదన్నారు. భారత ప్రజాస్వామ్యం ప్రపంచ దేశాలకు ఆదర్శమని చెప్పారు. 2047 నాటికి స్వాతంత్ర్య సమరయోధుల కలలను సాకారం చేస్తామని ఆకాంక్షించారు. బాబాసాహెబ్ భీమ్‌రావ్ అంబేద్కర్ నేతృత్వంలో రాజ్యాంగాన్ని రూపొందించిన వారి దార్శనికతకు ఒక నిర్దిష్టమైన రూపాన్ని ఇవ్వగలుగుతామని ముర్ము అన్నారు. పేదరికం, నిరక్షరాస్యతపై భారత పోరాడం సాగుతోందని తెలిపారు. హర్ ఘర్ తిరంగా నినాదం విజయవంతమైందని చెప్పారు. కరోనాను సమర్థంగా ఎదుర్కొని ప్రపంచానికి మన సత్తా చాటిచెప్పామని అన్నారు. కరోనా వేళ ప్రపంచం ఎన్నో సవాళ్లు ఎదుర్కొన్నదని, చాలా దేశాలు ఆర్థిక సంక్షోభాల్లో చిక్కుకున్నాయని గుర్తు చేశారు. విపత్కర పరిస్థితులకు సమర్థంగా అధిగమించగలిగామని చెప్పారు. కరోనా వాక్సినేషన్‌లో ప్రపంచానికే ఆదర్శంగా నిలిచామని తెలిపారు. స్టార్టప్‌ల ఏర్పాటుతో దేశాభివృద్ధి జరుగుతోందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థలో డిజిటల్ విధానం పెను మార్పులు తెచ్చిందని అన్నారు. ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణంలో అందరూ భాగస్వాములు కావాలని ముర్ము పిలుపునిచ్చారు. పటిష్ఠ ఆర్థిక వ్యవస్థ ఘనత రైతులకు, కార్మికులకు చెందుతుందని చెప్పారు. మన దేశం మనకు జీవితంలో చాలా ఇచ్చిందని.. దేశ రక్షణ, భద్రత, పురోగతి, శ్రేయస్సు కోసం మనం చేయగలిగినదంతా చేస్తామని ప్రతిజ్ఞబూనాలని పిలుపునిచ్చారు. వాతావరణ సవాళ్లను ఎదుర్కొంటున్న క్రమంలో భారత్ సహజ వనరుల పరిరక్షణకు కంకణబద్ధులు కావాలని, నీరు, నేల, జీవవైవిధ్యతను పరిరిక్షించడం భావితరాల పట్ల మన కర్తవ్యమని రాష్ట్రపతి అన్నారు. ప్రకృతి పరిరక్షణ జీవితంలో భాగమన్నారు. అమరజవాన్ల త్యాగాల వల్లే స్వేచ్ఛావాయువులు పీల్చుకోగలుగుతున్నామని; వారి త్యాగాలను స్మరించుకోవాలని చెప్పారు. ఆధునిక భారత నిర్మాణానికి ఎందరో మహానుభావులు కంకణ బద్ధులయ్యారని, వారందరినీ స్మరించుకోవాలని ముర్ము సూచించారు. సాయుధ దళాలకు, భారతీయ దౌత్యకార్యాలయాలందరికీ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలుపుతూ తన ప్రసంగాన్ని రాష్ట్రపతి ముర్ము ముగించారు.

డీఎస్సీ జాప్యం

(మొదటిపేజీ తరువాయి)

పండిట్లు, పీఈటీ తదితర కోర్సులు చేసి, ఆ తర్వాత టెట్‌లో అర్హత సాధించి, ఉపాధ్యాయ పోస్టుల నియామక పరీక్ష(డీఎస్సీ) కోసం అభ్యర్థులు పడిగాపులు కాస్తున్నారు. గతంలో పోలిస్తే, ఇప్పుడు డీఎస్సీకి పోటీ పడటం కష్టతరం. ఏపీపీఎస్సీ గ్రూప్-1 తో సమానంగా డీఎస్సీకి పోటీ నెలకొంటోంది. టెట్ మార్కులకు సైతం డీఎస్సీలో వెయిటేజీ ఇవ్వడంతో టెట్, డీఎస్సీ పరీక్షలకు వేర్వేరుగా ఉపాధ్యాయ శిక్షణార్థులు పోటీ పడాల్సిన పరిస్థితి ఏర్పడింది.

వయసు మీరింది...

మూడేళ్లుగా డీఎస్సీ ప్రకటన ఇవ్వనందున దాదాపు లక్ష మంది అభ్యర్థులకు వయసు మించిపోయి డీఎస్సీ పోస్టులకు అనర్హులుగా మారారు. గత ప్రభుత్వం డీఎస్సీ-2018 వరకు అభ్యర్థుల వయోపరిమితిని 44 ఏళ్లుగా (జనరల్) అమలు చేసింది. రిజర్వేషన్ అభ్యర్థులైన ఎస్సీ,ఎస్టీలకు మరో ఐదేళ్లు సడలింపు ఇచ్చింది. 2018 డీఎస్సీకి అతి తక్కువ సంఖ్యలో పోస్టులకు అప్పటి చంద్రబాబు ప్రభుత్వం ప్రకటన ఇచ్చింది. జిల్లాలో కేటగిరీకి ఒకటి,రెండు పోస్టులతోనే సరిపెట్టారు. చాలా జిల్లాల్లో అసలు పోస్టులే లేవు. దీంతో అభ్యర్థుల మధ్య పోటీ భారీగా నెలకొంది. నామ మాత్రంగానే డీఎస్సీ రాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏళ్ల తరబడి శిక్షణ తీసుకున్న అభ్యర్థులు సైతం ఆ డీఎస్సీలో, అతి తక్కువ ఖాళీలు ఉన్నందున ఉద్యోగాలు సాధించలేక పోయారు. 2018లో డీఎస్సీ రాని అభ్యర్థులంతా చంద్రబాబు ప్రభుత్వ విధానాలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 2019 ఎన్నికల్లో యేటా డీఎస్సీ ఇస్తామంటూ జగన్ ఇచ్చిన హామీని నమ్మి అత్యధికంగా ఓట్లు వేశారు. జగన్ సీఎంగా బాధ్యతలు చేపట్టిన మొదటి ఏడాదిలోనే తమకు డీఎస్సీ ప్రకటన వస్తుందని ఆశించి భంగపాటుకు గురయ్యారు. రెండో ఏడాది, మూడో ఏడాది ఇలా..మూడేళ్లలోనూ ఒక్క డీఎస్సీ ప్రకటనను జగన్ ప్రభుత్వం ఇవ్వకుండా ఉపాధ్యాయ అభ్యర్థులను తీవ్రంగా అన్యాయం చేసిందనే విమర్శలున్నాయి. నాడు చంద్రబాబు వ్యవహరించిన విధంగానే జగన్ వ్యవహరిస్తున్నారని దుయ్యబడుతున్నారు. డీఎస్సీలో జాప్యం వల్ల 2018 డీఎస్సీ నాటికే వయోపరిమితి మీరడానికి దగ్గరలో వున్న అభ్యర్థులకు తీవ్ర నిరాశ ఎదురైంది. 2018 డీఎస్సీలో జనరల్-44, రిజర్వేషన్ అభ్యర్థులకు 49 ఏళ్ల వరకు అవకాశమిచ్చారు. ఇక జగన్ ప్రభుత్వం ఇతర శాఖల ప్రభుత్వ ఉద్యోగాల భర్తీలో జనరల్ అభ్యర్థుల వయోపరిమితిని 42 ఏళ్లకే కుదించింది. ఇదే విధానం డీఎస్సీకి అవలంబిస్తే జనరల్ అభ్యర్థులకు 42, రిజర్వేషన్ అభ్యర్థులకు 47తో వయోపరిమితి ఖరారు కానుంది. దీంతో మూడేళ్ల నుంచి డీఎస్సీ కోసం ఎదురు చూస్తున్న వారిలో దాదాపు లక్షల మంది వయోపరిమితి మించిపోయి, ఉపాధ్యాయ ఉద్యోగాలకు అనర్హులుగా మారే ప్రమాదముంది. దీనికి జగన్ ప్రభుత్వం మూల్యం చెల్లించుకోవాల్సి ఉందని అభ్యర్థులు హెచ్చరిస్తున్నారు.

జనరల్ అభ్యర్థుల వయోపరిమితిని 47ఏళ్లకు పెంచాలి

ఏపీలో ఉపాధ్యాయ పోస్టులు మూడేళ్ల నుంచి భర్తీ చేయనందున, ఆ మేరకు న్యాయం చేసేందుకుగాను జనరల్ అభ్యర్థుల వయోపరిమితి 47 ఏళ్లకు, రిజర్వేషన్ వర్గాలకు అదనంగా ఐదేళ్లు పెంచి డీఎస్సీ ప్రకటన తక్షణమే ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. లేకుంటే దాదాపు లక్ష మంది డీఎస్సీకి దూరమయ్యే ప్రమాదముంది. ప్రభుత్వ పెద్దలు, విద్యాశాఖ ఉన్నతాధికారుల మధ్య సమన్వయం లేనందనే, డీఎస్సీ అభ్యర్థులకు ఈ దుస్థితి వచ్చిందనే విమర్శలున్నాయి. ఏళ్ల తరబడి పెండింగ్ డీఎస్సీలకు చెందిన కొద్దిపాటి అభ్యర్థులను కాంట్రాక్టు పద్ధతిలో ప్రభుత్వం నియమించి చేతులు దులుపుకుంది. నూతన డీఎస్సీల ప్రకటనలపై ఆసక్తి చూపడం లేదు.

దీంతో అన్ని అర్హతలు ఉండి, వయస్సు మించిపోవడంతో చాలా మంది అభ్యర్థులు ఉపాధ్యాయ పోస్టులకు పూర్తిగా దూరమై పోతున్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని గుర్తెరిగి, మూడేళ్ల నుంచి డీఎస్సీ లేనందున వారి వయోపరిమితి పెంపుదలకు చర్యలు తీసుకోవాలని అభ్యర్థులు కోరుతున్నారు.

బంగ్లాలోనూ లంక పరిస్థితులే

- ఆర్థిక సంక్షోభం అంచున దేశం
- ఇబ్బందులు లేవంటూనే అప్పుల వేట

ఢాకా : శ్రీలంక బాటలో బంగ్లాదేశ్ పయనిస్తోంది. ఆర్థిక సంక్షోభం అంచులకు చేరుకొంది. అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్)ని బెయిలౌట్ ప్యాకేజి కోసం అభ్యర్థించింది. మూడేళ్లలో 4.5 బిలియన్ డాలర్లు ఇవ్వాలని కోరింది. ఆర్థికంగా ఎటువంటి ఇబ్బంది లేదని బంగ్లాదేశ్ పాలకులు చెబుతున్నారు. తక్కువ వడ్డీ రుణాలను అవసరాలకు వాడుకోవడానికేనని ప్యాకేజి కోరడాన్ని సమర్థించుకున్నారు. ప్రపంచంలోనే వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశాల్లో బంగ్లాదేశ్ ఉంది. 416 బిలియన్ డాలర్ల జీడీపీతో ప్రపంచంలోనే 33వ స్థానంలో నిలిచింది. ఈ దేశ ఆర్థిక వ్యవస్థ ముఖ్యంగా వ్యవసాయం, సేవా రంగాలపై ఆధారపడుతోంది. జీడీపీలో 56శాతంగా ఉన్న దేశ సేవా రంగం కోవిడ్ కారణంగా బాగా దెబ్బతింది. దీంతో 11లక్షల మంది నిరుద్యోగులయ్యారు. బంగ్లాదేశ్ ఎగుమతుల్లో 84శాతం వాటా ఉన్న రెడీమేడ్ వస్త్రాలకు గిరాకీ లేకుండా పోయింది. ఆర్డర్లు రాక చెల్లింపులు ఆలస్యం కావడం సమస్యగా మారింది. విదేశాల్లో ఉండే బంగ్లాదేశీయులు స్వదేశానికి పంపే మొత్తాలు తగ్గిపోయాయి. ప్రపంచ బ్యాంకు ప్రకారం విదేశాల నుంచి రెమిటెన్సెస్‌లు అధికంగా అందుకొనే దేశాల్లో బంగ్లాదేశ్ ఏడో అతిపెద్ద దేశమని తెలుస్తోంది. 2020-21లో 24.77 బిలియన్ డాలర్లు అందుకోగా ఆ తర్వాతి ఏడాది 21.03 బిలియన్ డాలర్లకు తగ్గింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం కారణంగా చమురు రేట్లు పెరగడం కూడా బంగ్లాదేశ్‌కు శాపంగా మారింది. ఫలితంగా దేశ వాణిజ్య లోటు 33 బిలియన్ డాలర్లకు చేరింది. ఇది చాలా ఎక్కువ. దీంతోపాటు దేశ రిజర్వు కరెన్సీ నిల్వలు 40 బిలియన్ డాలర్ల కంటే కిందకు చేరిపోయాయి. ఫలితంగా టాకా విలువ మేలో డాలర్‌కు 86 టాకాలు ఉండగా.. ప్రస్తుతం 94 టాకాల వద్ద కొనసాగుతోంది. దీనికి అమెరికా ఫెడ్ వడ్డీరేట్లు ఆజ్యం పోశాయి. డాలర్ డిమాండు గణనీయంగా పెరిగింది.

పెరిగిన ఇంధన ధరలు

ఎన్నడూ లేని విధంగా ఈ నెల 5న దేశంలో ఇంధన ధరలకు రెక్కలొచ్చాయి. డీజిల్, కిరోసిన్ ధరల్లో 42.5శాతం, పెట్రోల్‌పై 51.1శాతం, ఆక్టేన్‌పై 51.7శాతం ధర పెరిగింది. ఫలితంగా డీజిల్, కిరోసిన్ 34 టాకాలు పెరిగి 114 టాకాలకు, పెట్రోల్ 86 టాకాలు పెరిగి 130 టాకాలకు, ఆక్టేన్ 89 టాకాలు పెరిగి 135 టాకాలకు చేరింది.

రెండ్రోజులు విస్తారంగా వర్షాలు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో రానున్న రెండు రోజులపాటు విస్తారంగా వర్షాలు కురుస్తాయని విశాఖ వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఆదివారం తెల్లవారుజాము నుంచి వర్షాలు కురుస్తున్నాయి. రోజంతా ముసురు వాతావరణం నెలకొంది. ఈ అల్పపీడనం కారణంగా రాష్ట్రవ్యాప్తంగా 48 గంటల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు అంచనా వేశారు. ఇప్పటికే అనేక ప్రాంతాల్లో వరద ముంపు నుంచి ప్రజలు తేరుకోక ముందే మళ్లీ వర్షాలు కురుస్తాయన్న హెచ్చరికతో ఆందోళన నెలకొంది.

వంశధారకు పోటెత్తిన వరద

విశాలాంధ్ర-శ్రీకాకుళం: గడచిన రెండురోజులుగా కురుస్తున్న వర్షాలతో వంశధార నదికి వరద ప్రవాహం పోటెత్తింది. జిల్లాతో పాటు ఒడిశా పరివాహక ప్రాంతంలో కూడా వర్షాలు కురవడంతో వంశధార ప్రాజెక్టుకు వరద ప్రవాహం పెరిగింది. ప్రాజెక్ట్ వద్ద ఆదివారం సాయంత్రానికి నదిలోకి 48 వేల క్యూసెక్కుల నీరు చేరుతుండటంతో గొట్టా బ్యారేజి 12 గేట్లను ఎత్తి...నీటిని దిగువకు వదిలారు. మొదటి ప్రమాద హెచ్చరికను విడుదల చేశారు.

కాపాడుకుంటాం

(మొదటిపేజీ తరువాయి)

ప్రశ్నించారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను 550 రోజులుగా ప్రైవేట్ పరం కాకుండా కార్మికులు అడ్డుకున్నారని, ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో స్టీల్ ప్లాంట్ పరిరక్షణ కోసం పోరాటాలు చేస్తామన్నారు. 75 ఏళ్ల స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వరంగ సంస్థలను కాపాకుంటామని విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజాసంఘాల జేఏసీ నాయకులు ప్రతినబూనారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు మంత్రి రాజశేఖర్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జె.రామకృష్ణ ముఖ్య వక్తలుగా పాల్గొని మాట్లాడుతూ స్వాతంత్ర్యం అనంతరం ప్రభుత్వరంగ సంస్థల ఏర్పాటు ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ, దేశాభివృద్ధి సాధించడం జరిగిందని తెలిపారు. వ్యవసాయంపై ఆధారపడిన భారతదేశంలో పారిశ్రామిక రంగంలో విస్తరించి యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు వీలుగా అనేక ప్రైవేట్ పరిశ్రమలను ప్రభుత్వరంగ సంస్థలుగా మార్చటాన్ని వారు గుర్తు చేశారు. విశాఖపట్నం పోర్టు, రైల్వే, రక్షణ, చమురు, బొగ్గు, విమానయానం, షిప్ యార్డు, బీహెచ్‌పీవీ, విద్యుత్ వంటి అనేక పరిశ్రమలు దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుముకగా నిలిచాయన్నారు. నూతన ఆర్థిక విధానాలు వచ్చాక గత ప్రభుత్వాలు ప్రైవేటీకరణ చర్యలు తీసుకున్నా కార్మిక, ప్రజా పోరాటాలకు తలొగ్గి వెనక్కు తగ్గేవన్నారు. కానీ 2014 కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో ఒక్క పరిశ్రమను నెలకొల్పకపోగా ఉన్న ప్రభుత్వరంగ సంస్థలను మోదీ, అమిత్ షా... అంబానీ, అదానీలకు కట్టబెట్టే చర్యలు దూకుడుగా అమలు చేశాయని విమర్శించారు. పాలకులు కార్పొరేటీకరణ విధానాలు వీడే వరకు కార్మికులు ఐక్యంగా ఉద్యమిస్తారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు ఆర్.కె.ఎస్.వి.కుమార్, బి.నాగభూషణం, ఎస్.కనకారావు, వై.మస్తానప్ప, వి.రామ్మోహనరావు, ఎం.అప్పారావు, ఎం.వెంకటేశ్వర్లు, ఎస్.జ్యోతీశ్వరరావు, యుగంధర్, వై.సత్యవతి, ఎం.వెంకటలక్ష్మి, జి.నాయనబాబు, ఎల్.జె.నాయుడు, శ్రావణ్‌కుమార్, కళారంగం నాయకులు ఎం.చంటి, నిర్మల, దళిత హక్కులు సంఘం నాయకులు ఆర్.పి.రాజు, సీఎఫ్‌టీయూఐ నాయకులు బాలభాను, వెంకటలక్ష్మి, లక్ష్మి, సీఐటీయూ నాయకులు పి.మణి, ఆర్.లక్ష్మణమూర్తి, పి.వెంకటరావు, ఎం.సుబ్బారావు, ఓ.అప్పారావు, చంద్రమౌళి, ఐఎన్‌టీయూసీ నాయకులు కె.ఈశ్వరరావు, తాతబాబు, ఏఐటీయూసీ నాయకులు కె.సత్తిబాబు, కోట ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలి : సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి

విశాలాంధ్ర-కూర్మన్నపాలెం: కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు ఊడిగం చేస్తోందని, స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి పిలుపునిచ్చారు. ఆగస్టు 15 భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయానికి వ్యతిరేకంగా విశాఖ స్టీల్ ప్లాంట్ పర్మినెంట్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు, ఉక్కు నిర్వాసితులు, ఇతరులు దండి ఉప్పు సత్యాగ్రహ దీక్ష స్ఫూర్తితో ఆదివారం ఉదయం 6 గంటల నుంచి సోమవారం సాయంత్రం 6 గంటల వరకు కొనసాగే 36 గంటల ఉక్కు సత్యాగ్రహ దీక్షను చేపట్టారు. ఈ సందర్భంగా జేవీఎస్ఎన్ మాట్లాడుతూ ఎంతటి నియంత అయినా ప్రజాఉద్యమాలకు తలవంచక తప్పదని అన్నారు. ప్రపంచ చరిత్రలో ఎంతోమంది నియంతలు కాలగర్భంలో కలసిపోయారని గుర్తు చేశారు. ప్రపంచ కార్మిక పోరాటాలకు ఏ ప్రభుత్వాలూ ఎదురొడ్డి నిలిచిన చరిత్రలేదని అన్నారు. ఈ స్టీల్ ప్లాంట్ ఆంధ్ర ప్రజల మనోభావాలను ప్రతిబింబించేదని, దీనిని కాపాడుకోవడంలో విశాఖ ఉక్కు ఉద్యోగులు, నిర్వాసితులు, ప్రజలు, ప్రజా సంఘాలు 550 రోజులుగా అలుపెరగని పోరాటం చేస్తున్నారని తెలిపారు. అయితే కేంద్ర ప్రభుత్వం ఇవేమీ పట్టించుకోకుండా సిగ్గులేకుండా స్టీల్ ప్లాంట్ అమ్మకాన్ని కొనసాగిస్తామనడం దారుణమని అన్నారు. తక్షణమే కేంద్ర ప్రభుత్వం విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ విషయంలో తమ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకపోతే రాబోయే రోజుల్లో ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేసి దేశవ్యాప్త ఉద్యమంగా మలచి కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తెస్తామని ఆయన హెచ్చరించారు. ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ సంఘం ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ ఉదయం కార్మికులకు పూలమాలలు వేసి దీక్షా శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరానికి కె.ఎస్.ఎన్.రావు, గంధం వెంకట్రావు, వై.టి.దాసు అధ్యక్ష వర్గంగా వ్యవరించగా డి.ఆదినారాయణ ప్రారంభోపన్యాసం చేశారు.

విశాఖ స్టీల్ ప్లాంట్ 32 మంది ప్రాణ త్యాగాలతో ఏర్పడిందని, సుమారు 64 గ్రామాల ప్రజలు భూత్యాగాలు చేశారని గుర్తు చేశారు. ఇప్పటికీ 8 వేల మంది నిర్వాసితులకు శాశ్వత ఉపాధి లేకుండా రోడ్డున పడ్డారని, వారికి ఉపాధి కల్పించాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వం మీద ఉందని అన్నారు. ఈ తరుణంలో విశాఖ ఉక్కును 100 శాతం వ్యూహాత్మక అమ్మకం పేరుతో ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే చర్యలను చేపట్టడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ దీక్షకు సంఘీభావంగా గాజువాక ఎమ్మెల్యే నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, గంగారాం, 78వ వార్డు కార్పొరేటర్, మాజీ ఎమ్మెల్సీ శర్మ, జనసేన నాయకులు గడసాల అప్పారావు, మంత్రి రాజశేఖర్, నీరుకొండ రామచంద్రరావు, మసేనురావు, మస్తానప్ప, విళ్లా రామమోహనరావు, వరసాల శ్రీనివాసరావు, ఎస్.రామారావు, లెనిన్, నరేంద్ర, అనేక మంది ప్రముఖులు, మహిళలు, పోరాట కమిటీ నాయకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

కేంద్ర విధానాలతో బీఎస్ఎన్ఎల్‌కు ముప్పు

ఎన్ఎఫ్‌టీఈ రాష్ట్ర సమ్మేళనంలో వక్తలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాల వల్లనే ప్రభుత్వ రంగ సంస్థ అయిన బీఎస్ఎన్ఎల్ మనుగడ ప్రశ్నార్థమైందని ఎన్ఎఫ్‌టీఈ జాతీయ ప్రధాన కార్యదర్శి చందేశ్వర్ సింగ్ విమర్శించారు. ఎన్ఎఫ్‌టీఈ రాష్ట్ర సమ్మేళన ఆదివారం విజయవాడ గవర్నర్‌పేట మెడికల్ అసోసియేషన్ హాలులో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన చందేశ్వర్‌సింగ్ మాట్లా డుతూ, బీజేపీ ప్రభుత్వం అన్ని ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ వ్యక్తులకు ధారాదత్తం చేస్తుందని, లక్షల కోట్ల విలువ కలిగిన ఆస్తులు కలిగి ఉండటమే కాక దేశంలో నెంబర్ వన్ నెట్‌వర్క్ కలిగి ఉండి ప్రైవేటు సంస్థల కన్నా సామర్థ్యం కలిగిన ఇంజనీర్లు, అధికారులు, సిబ్బంది ఉన్నప్పటికీ స్వచ్ఛంద పదవీ విరమణ పేరుతో 92వేల మందిని ఇంటికి పంపారన్నారు. నూతన పదవీ విరమణ లేదని ఉద్దేశపూర్వకంగానే సంస్థను నిర్వీర్యం చేస్తుందని విమర్శించారు. ఇలాంటి విధానాలను ప్రతిఘటించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

మరో అతిథి ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ, ప్రభుత్వరంగ సంస్థలన్నీ ఒక్కొక్కటిగా నిర్వీర్యం చేస్తూ నష్టాల్లో ఉన్నాయనే సాకుతో వాటిని కార్పొరేట్ శక్తులను అప్పజెప్పే పనిలో కేంద్రం ఉందని ఎద్దేవా చేశారు. పోరాటాల ద్వారా సాధించుకున్న అనేక సంస్థలు అదాని చేతుల్లోకి పోతున్నాయని, ఇప్పటికే బొగ్గు గనులు, ఓడరేవులు, రైల్వే కోచ్‌లు, లైన్లు, స్టేషన్లు, చాలా బ్యాంకులు ధారాదత్తం చేస్తు న్నారని మండిపడ్డారు. ప్రాణత్యాగాల ద్వారా సాధిం చుకున్న విశాఖ ఉక్కును కూడా పోస్కో కంపెనీకి కట్టబెట్టాలని ప్రయత్నిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడి కార్మికవర్గం 560 రోజులుగా పోరాడుతూనే ఉందని, వారికి మద్దతుగా రాష్ట్రవ్యాప్తంగా సంఘీభావ ఉద్యమాలు కార్మిక సంఘాలు చేపట్టాయని రవీంద్రనాథ్ వివరించారు. బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు పోరాటాల ద్వారా సంస్థను కాపాడుకోవాలని అన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాలుగు లేబర్ కోడ్‌ల కు వ్యతిరేకంగా జరిగే పోరాటాల్లో భాగస్వామ్యం కావాలని కోరారు. తొలుత యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎన్.అంజయ్య రాష్ట్ర సమ్మేళనం ప్రాముఖ్యతను వివరించారు. అక్టోబర్‌లో జరగనున్న వెరిఫికేషన్‌లో ఎన్ఎఫ్‌టీఈని గెలిపించేందుకు కృషి చేయాలని కోరారు. యూనియన్ సహాయ కార్యదర్శి నాగేంద్రబాబు వందన సమర్పణ చేశారు.

మాట్లాడుతున్న చందేశ్వర్‌సింగ్. వేదికపై రవీంద్రనాథ్, చంద్రశేఖర్ తదితరులు

అనంతబాబు, గోరంట్ల రక్షణే ప్రభుత్వ ధ్యేయమా?

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: హత్య చేసిన ఎమ్మెల్సీని, మహిళతో అసభ్యంగా ప్రవర్తించిన ఎంపీని రక్షించడమే సీఎం జగన్ ప్రభుత్వ ధ్యేయ మా? అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. దళిత యువకుడైన సుబ్రహ్మణ్యాన్ని హత్య చేసి, తన కారులోనే డోర్ డెలివరీ చేసిన వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబును రక్షించేందుకు, జగన్ ప్రభుత్వం తీవ్రంగా ప్రయత్నిస్తోందన్నారు. ప్రజా ప్రతినిధు లుగా ఉండి హత్యలు చేసే వారికి, మహిళలపై అసభ్యంగా ప్రవర్తించే వారికి పోలీసులు వత్తాసు పలికేలా ప్రవర్తించడం విచారకరమని, 90 రోజుల్లోపు ఛార్జ్ షీట్ వేయకుండా పోలీసులు అనంతబాబుకి ఎందుకు సహకరిస్తున్నారని నిల దీశారు. అనంతబాబుకు బెయిల్ వచ్చేందుకు చేస్తున్న కుట్ర వెనుక ఎవరున్నారనీ, అనంత బాబుపై జగన్ సర్కారుకు ఎందుకంత ప్రేమ? అని ప్రశ్నించారు. ఎంపీ గోరంట్ల మాధవ్ న్యూడ్ వీడియో వ్యవహారం దేశమంతా సిగ్గుతో తలదించుకునేలా ఉందని, ఈ వ్యవహారాన్ని పక్కదారి పట్టించేలా అనంత పురం ఎస్పీ పకీరప్ప ఎలాంటి విచారణ లేకుండా ఫేక్ అని తేల్చారని పేర్కొన్నారు. పోలీసుల సమర్థతకు ఈ రెండు కేసులు ప్రశ్నార్థకంగా నిలిచాయన్నారు. వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు కేసులో తక్షణమే పోలీసులు చార్జ్ షీట్ వేసి, సుబ్రహ్మణ్యం కుటుంబ సభ్యులకు న్యాయం చేయాలని రామకృష్ణ డిమాండ్ చేశారు. లేకుంటే అనంతబాబు కేసులో పోలీసు, ప్రభుత్వ వైఫల్యంపై ఉద్యమిస్తామని హెచ్చరించారు.

స్వాతంత్ర్య వేడుకల్లో భాగస్వాములు కావాలి

ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్ పిలుపు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: స్వాతంత్ర్య వేడుకల్లో ఏఐటీయూసీ శ్రేణు లంతా భాగస్వాములు కావాలని సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ ఆదివారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రముఖ పాత్ర వహించి, ప్రత్యక్షంగా ఉద్యమాల్లో పాల్గొన్న తొలి కార్మిక సంఘం ఏఐటీయూసీ అని కొనియాడారు. స్వాతంత్ర్యం సిద్ధించి 75 సంవత్సరాలు అయిన సందర్భంగా అన్ని ప్రాంతాల్లోనూ ఉద్యమంలో ఏఐటీయూసీ నిర్వహించిన పాత్రను వివరించాలన్నారు. కార్మిక వర్గ ప్రయోజనాల కోసం ఏఐటీయూసీ నిరంతరం పోరాడుతోందనీ, 44 కార్మిక చట్టాలు సాధించుకుంటే ఇప్పటి పాలకవర్గాలు వాటిని రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లుగా తేవడంలో హక్కులు హరించబడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ నిర్వీర్యం చేసి కార్పొరేట్లకు ధారాదత్తం చేయడాన్ని వివరించి స్వాతంత్ర్య ఫలాలు అందరికీ అందేలాగా ఉద్యమాలకు ప్రతిన బూనాలని కోరారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఓబులేసు

మాట్లాడుతున్న ఓబులేసు. పక్కన ఈశ్వరయ్య, నాగసుబ్బారెడ్డి, విజయలక్ష్మి, మనోహర్‌రెడ్డి, బాదుల్లా తదితరులు

విశాలాంధ్ర బ్యూరో- కడప : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలు ద్వారానే పరిష్కారమవుతాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి. ఓబులేసు తెలిపారు. ఆదివారం హోచిమిన్ భవన్‌లో కడప నగర సమితి 6వ మహాసభల్ని నిర్వహించారు. నగర కార్యవర్గ సభ్యులు మనోహర్ రెడ్డి, కేసి బాదుల్లా అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఓబులేసు మాట్లాడుతూ రెండవసారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం ఫాసిస్టు చర్యలను ముమ్మరం చేసిందని చెప్పారు. సాగు చట్టాల పేరుతో రైతులను, ప్రభుత్వ రంగాన్ని అమ్మేస్తూ దేశ ప్రజలను నట్టేట ముంచే చర్యలకు దిగిందని పేర్కొన్నారు. మతతత్వాన్ని ముందుకు తెచ్చి ప్రజల మధ్య చిచ్చు పెట్టిందని దుయ్యబట్టారు. అన్నదాతల పోరాటంతో సాగు చట్టాల విషయంలో వెనక్కు తగ్గిన కేంద్రం కార్మిక చట్టాలను రద్దు చేసి లేబర్ కోడ్ల అమలు కోసం మొండిగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. స్వాతంత్ర్యానికి పూర్వం కార్మికవర్గం పోరాడి సాధించుకున్న పనిగంటలు, హక్కులను కాలరాస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేట్ కంపెనీలకు ఊడిగం చేసి పేద ప్రజలపై పన్నుల భారం మోపుతోందని తెలిపారు. 32 మంది విద్యార్థులు ఆత్మబలిదానంతో సాధించుకున్న విశాఖ ఉక్కును ప్రవేటుపరం చేయడాన్ని ఏపీ ప్రజలు పెద్దఎత్తున వ్యతిరేకిస్తున్నా మొండిగా ముందు కెళుతోందని పేర్కొన్నారు. విభజన హామీలను అమలు చేయకుండా రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కేంద్రానికి వత్తాసు పలుకుతోందని విమర్శించారు. మోదీ ప్రభుత్వం చేస్తున్న అన్యాయాలను నిలదీయడంతో జగన్ ప్రభుత్వం విఫలమైందని పేర్కొన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి జి.ఈశ్వరయ్య మాట్లాడుతూ సీఎం జగన్ ఎన్నికల ముందు ఇచ్చిన అన్ని హామీలను తుంగలో తొక్కారని విమర్శించారు. రాష్ట్రంలో స్యాండ్, మైన్, వైన్ మాఫియాలు ప్రజలను దోచుకుంటుంటే విద్యుత్ చార్జీలు, ఆర్టీసీ చార్జీలు, ఇంటి పన్ను, నీటిపన్ను, చెత్తపన్నులు పెంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. నగదు బదిలీ పథకాల పేరుతో ఇచ్చేది గోరంత... తీసుకునేది కొండంత అనే చందంగా పాలన సాగుతోందని విమర్శించారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎల్. నాగసుబ్బారెడ్డి, సుబ్రహ్మణ్యం, రమణ, విజయలక్ష్మి మాట్లాడారు. సీపీఐ నగర కార్యదర్శి ఎన్. వెంకటశివ కార్యదర్శి నివేదిక ప్రవేశ పెట్టారు. మహాసభల ప్రారంభంలో సీపీఐ సీనియర్ నాయకులు నాగార్జున రెడ్డి జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో నగర కార్యవర్గ సభ్యులు కే. మునయ్య, మల్లికార్జున పార్టీ నేతలు జి.వేణుగోపాల్, సావంత్ సుధాకర్, మద్దిలేటి, కార్యదర్శి ఓబయ్య, నాగరాజు, భీమరాజు, చిన్నప్ప లింగన్న, నాగిరెడ్డి, అర్.బాబు శంకర్ నాయక్, సుబ్బారాయుడు, గౌస్, ఈశ్వరయ్య, భాగ్యలక్ష్మి, ఏఐఎస్ఎఫ్ నేతలు గంగా సురేశ్, వలరాజు, సుబ్బారాయుడు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించండి

ముఖ్యమంత్రికి టీడీపీ ఎమ్మెల్యే అనగాని లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని టీడీపీ ఎమ్మెల్యే అనగాని సత్యప్రసాద్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సీఎం జగన్‌కు ఆదివారం ఆయన లేఖ రాశారు. వైసీపీ పాలనలో ప్రభుత్వం నుంచి సహాయ, సహకారాలు అందక జర్నలిస్టులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. చాలా మందికి అక్రిడేషన్లు లేక విధి నిర్వహణలో అసౌకర్యానికి గురవుతున్నారని, ఫోటోగ్రాఫర్లు, కెమేరామెన్లకు హెల్త్ కార్డులు కూడా లేవన్నారు. కరోనాతో మృతి చెందిన జర్నలిస్టుల కుటుంబాలకు నేటికీ ఆర్థికసాయం అందలేదని పేర్కొన్నారు. తమ సమస్యలను జర్నలిస్టులు చాలా సార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినప్పటికీ స్పందించలేదన్నారు. 2019 నుంచి రాష్ట్రంలో జర్నలిస్టులకు అక్రిడేషన్లు మంజూరు చేయకుండా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం జర్నలిస్టులపై కక్షసాధింపు చర్యలను విడనాడాలని, అర్హులైన జర్నలిస్టులు, ఫోటోగ్రాఫర్లు, కెమేరామెన్లకు అక్రిడేషన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ హయాంలో 24 వేలమందికి అక్రిడేషన్లు ఇచ్చామని ఎమ్మెల్యే అనగాని చెప్పారు. అక్రిడేషన్ ఉన్న జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు స్కూళ్లలో ఫీజుల్లో 50 శాతం రాయితీ ఇచ్చామని, దాన్ని మూడేళ్లుగా అటకెక్కించారని ఎద్దేవా చేశారు. విధి నిర్వహణలో చనిపోయిన జర్నలిస్టు కుటుంబాలకు చంద్రబాబు రూ.10 లక్షలు ఆర్థికసాయం అందించేవారనీ, ఈ మూడేళ్లలో ఒక్క కుటుంబానికి కూడా సాయం అందలేదన్నారు. టీడీపీ హయాంలో జర్నలిస్టులకు మంజూరు చేసిన ఇళ్లస్థలాలను రద్దు చేసి, వారికి అన్యాయం చేశారని మండిపడ్డారు.

విశాఖలో అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్

31 వరకు ర్యాలీ... భారీగా తరలివచ్చిన అభ్యర్థులు

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన అగ్నివీర్ ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ ఆదివారం స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ప్రారంభమైంది. ఈనెల 31 వరకు ఈ ర్యాలీ జరగనుంది. స్టేడి యంలో 24 గంటలు విద్యుత్తు, నీటి సరఫరా, బస ఏర్పాట్లు చేశారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి అభ్యర్థులు భారీగా తరలివచ్చారు. రోజంతా వర్షం కురవడంతో అభ్యర్థులు ఇక్కట్లు ఎదుర్కొన్నారు. రన్నింగ్ ట్రాక్‌పై నీరు, బురద లేకుండా అధికారులు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కలెక్టర్ ఆదేశించారు.

గ్యాస్ సిలిండర్ పేలి మహిళ దుర్మరణం

కుప్పకూలిన ఇల్లు, చెల్లాచెదురైన మృతదేహం

విశాలాంధ్ర-వేపాడ: విజయనగరం జిల్లా పెద్ద కృష్ణరాజపురం గ్రామంలో ఆదివారం ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలి మహిళ దుర్మరణం చెందింది. పోలీసుల వివరాల మేరకు, గ్రామ కూడలిలోని ఓ ఇంట్లో రొంగలి చంద్రమ్మ (40) ఉదయం 9 గంటల సమయంలో వంట చేసేందుకు గ్యాస్ సిలిండర్ వెలిగించగా ప్రమాదవశాత్తూ అది పేలడంతో ఆమె దేహం తునాతునకలైంది. గోడలు చెల్లాచెదురై స్లాబు కుప్పకూలింది. ఇదిలా ఉండగా, ఏడాది క్రితం అనారోగ్యంతో తండ్రి సన్యాసిరావు (45) మృతి చెందడంతో తమకు దిక్కెవరంటూ మృతురాలి కుమారుడు శివరామ్, కుమార్తె శ్రావణీ కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. స్థానికులు శృంగవరపుకోట అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించగా హుటాహుటిన సిబ్బంది ప్రమాదస్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. దుర్ఘటన తెలుసుకున్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సింహాద్రినాయుడు ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన పిల్లలను ఆదుకోవాలని సర్పంచ్ ముమ్ములూరి జగ్గీబాబు సీఐకు విజ్ఞప్తి చేశారు. వల్లంపూడి ఎస్సై కే రాజేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శృంగవరపుకోట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

మాట్లాడుతున్న శ్రీనివాసరావు. పక్కన రామకృష్ణ, సీతారామ్, బాబురావు తదితరులు

బీజేపీ మతోన్మాద విధానాలపై పోరాడదాం

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-ఏలూరు: 75 ఏళ్ల స్వాతంత్ర్యాన్ని, రాజ్యాంగాన్ని కాపాడు కునేందుకు కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం అనుసరి స్తున్న మతోన్మాద, కార్పొరేట్ విధానాలపై పోరాడాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాస రావు పిలుపు నిచ్చారు. ఆదివారం పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో సీపీఎం కార్యాలయం ఉద్దరాజు రామం భవనంలో పార్టీ జిల్లా విస్తృత సమా వేశంలో ఆయన మాట్లాడుతూ ... ఎందరో మహానుభావులు త్యాగాలు చేసి స్వాతంత్ర్యాన్ని సాధిస్తే ఆ స్వాతంత్ర్య లక్ష్యాలను బిజెపి ధ్వంసం చేస్తోందన్నారు. నాడు దేశానికి సంపూర్ణ స్వరాజ్యం కావాలని కమ్యూనిస్టులే తొలుత కోరారని, కమ్యూనిస్టులే నేటికీ స్వాతంత్ర్యో ద్యమ వారసులుగా ఉన్నారన్నారు. కార్మిక చట్టాల్లో మార్పులు, నూతన వ్యవసాయ చట్టాల పేరుతో వ్యవసాయ కార్పొరేటీకరణ, ప్రజా పంపిణీ వ్యవస్థ నిర్వీర్యం వంటి ప్రజా వ్యతిరేక చర్యలకు కేంద్ర ప్రభుత్వం పూనుకుందని విమర్శించారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీల విషయంలో కేంద్ర ప్రభుత్వంపై వైసీపీ ప్రభుత్వం పోరాడకుండా రాష్ట్ర ప్రయోజనాలను తాకట్టు పెట్టి సాగిల పడడం దుర్మార్గం అన్నారు. సమావేశానికి సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు తెల్లం రామకృష్ణ అధ్యక్షత వహించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు మంతెన సీతారామ్, రాష్ట్ర కమిటీ సభ్యుడు చింతకాయల బాబూరావు, ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి తదితరులు ప్రసంగించారు.

గౌతమ్‌రాజుకు రాజబాబు స్మారక పురస్కారం

విశాలాంధ్ర- విజయవాడ (అజిత్‌సింగ్‌నగర్): మానస సాహిత్య సాంస్కృతిక అకాడమి 21వ వారికోత్సవ వేడుకలను స్వాతంత్ర వజ్రోత్సవాల సంద ర్భంగా ఘనంగా నిర్వహించారు. ప్రముఖ సాహితీవేత్త వేముల హజరత్తయ్య గుప్తా అధ్యక్షతన విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా సినీ హాస్యనటుడు గౌతం రాజుకు హాస్యనట చక్రవర్తి రాజబాబు స్మారక పురస్కారాన్ని మాజీ ఎమ్మెల్సీలు జల్లి విల్సన్, ఏఎస్.రామకృష్ణ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా గౌతం రాజు మాట్లాడుతూ... కనీళ్లు అనుభవిస్తే గాని కళా రంగంలో ఎదగలేరని చెప్పారు. విద్యార్థి దశ నుంచి తాను నాటకాలు వేసేవాడినని తెలిపారు. కాకినాడలో అనార్కలీ నాటకంలో వేషం వేసిన సందర్భంగా ఎదురైన సంఘటనల్ని గుర్తు చేసుకున్నారు. మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ... మానస సంస్థ సొంతంగా నిధులు సమకూర్చుకుని ఆదర్శవంతమైన కార్యక్రమాలు నిర్వహించ టాన్ని అభినందించారు. ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన కళాకారుల్ని, సాహితీవేత్తలను, కవులు గుర్తించి ప్రోత్సహించటం స్ఫూర్తిదా యకంగా ఉందన్నారు. మరో మాజీ ఎమ్మెల్సీ ఏఎస్ రామకృష్ణ మాట్లాడుతూ ప్రజల్లో చైతన్యం తీసుకురావటానికి సాహిత్యం గొప్ప సాధనం అన్నారు. స్మార్ట్ ఫోన్లు సమాజంలో ప్రజల వ్యక్తిత్వాన్ని హననం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు పి.తులసీనాథం నాయుడు, మెజీషియన్ బోసు, జబర్దస్త్ ఫేం వై.దుర్గారావు, ఎక్స్‌రే అధ్యక్షుడు కొల్లూరి, విశ్రాంత ఉపాధ్యాయిని లలితకుమారి, మానస సంస్థ అధ్యక్షుడు సిహెచ్ విఎస్.బ్రహ్మ నందరావు, సినీ దర్శకుడు డాక్టర్ పి.ఎం.సుంద రారావు, బాపుగారి గోపి తదితరులు పాల్గొన్నారు. తొలుత జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించిన తరువాత స్వాతంత్ర సమరయోధులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ కె.వి.ఎల్.శర్మ నిర్వహణలో కవి సమ్మేళనం, గానామృతం జరిగాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి 40 మంది కవులు, కళాకారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన ప్రముఖులను ఈ సందర్భంగా నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.

సీజే మిశ్రాను పరామర్శించిన జగన్ దంపతులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంత్‌కుమార్ మిశ్రాను సీఎం జగన్ దంపతులు ఆదివారం పరామర్శించారు. ఇటీవల జస్టిస్ మిశ్రా తల్లి నళినీ మిశ్రా కన్నుమూశారు. విజయవాడలోని సీజే నివాసానికి జగన్, వైఎస్ భారతి వెళ్లారు.

సమస్యలపై పోరాడుదాం: పవన్ కల్యాణ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: స్వాతంత్ర్య ఉద్యమ స్ఫూర్తితో సమస్యలపై పోరాడాలని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పిలుపునిచ్చారు. మంగళగిరిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జనసేన ఐటీ విభాగం రాష్ట్రస్థాయి సదస్సు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పదవి అనేది మన వెంట రావాలని, పదవుల కోసం వెంపర్లాడవద్దన్నారు. సంస్థలు, వ్యక్తులు మోసం చేయడం కాదని, రాష్ట్ర ప్రభుత్వమే మోసగిస్తోందని దుయ్యబట్టారు. మద్యనిషేధం, ఉద్యోగాల విషయంలో మాటమార్చారని ఆయన తప్పుబట్టారు. భవిష్యత్ తరాల కోసమే తన ఆరాటమన్నారు. నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ, అక్టోబర్ 5 నుంచి జనసేన అధినేత పవన్ కల్యాణ్ యాత్ర ప్రారంభిస్తారని, రాష్ట్ర వ్యాప్తంగా పర్యటిస్తారని ప్రకటించారు. రాజకీయాల్లో ప్రసార మాధ్యమం కీలక పాత్ర పోషిస్తోందన్నారు. సంక్షేమం అంటూ ప్రభుత్వం అభివృద్ధిని మరిచిందని ధ్వజమెత్తారు. జగన్ సర్కార్ రాష్ట్రానికి పెట్టుబడులు రాకుండా చేస్తోందని అన్నారు. హైదరాబాద్‌లో ఐటీరంగం దూసుకెళ్తుంటే, ఏపీలో దిగజారుతోందని విమర్శించారు. జనసేన మేనిఫెస్టోలో ఐటీ అభివృద్ధికి ప్రత్యేకస్థానం కల్పిస్తామని మనోహర్ చెప్పారు. వివిధ జిల్లాల నాయకులు పాల్గొన్నారు.

'త్రివర్ణ ప్రకాశం'తో మురిసిన ఒంగోలు

- 3 కిలోమీటర్ల జాతీయ జెండాతో జనసంద్రం
- మినీ స్టేడియానికి శోభతెచ్చిన విద్యార్థులు
- దేశభక్తి గీతాలతో మారుమోగిన వీధులు

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : మూడు కిలోమీటర్ల మువ్వన్నెల జెండాతో ఒంగోలు నగరం మురిసిపోయింది. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఆదివారం 'త్రివర్ణ ప్రకాశం' పేరుతో జిల్లా యంత్రాంగం చేపట్టిన ఫ్లాగ్‌మార్చ్‌లో సుమారు పదివేల మంది పాల్గొనడంతో జనసంద్రంగా మారింది. తాము సైతం అంటూ ప్రజలు స్వచ్ఛందా తరలివచ్చి దేశభక్తిని చాటుకున్నారు. దేశభక్తి గీతాలతో వీధులన్నీ మారుమోగాయి. రవిప్రియ మాల్ నుంచి అద్దంకి బస్టాండ్ ... కలెక్టరేట్ మీదుగా సాగిన ర్యాలీ విశేషంగా ఆకట్టుకుంది. త్రివర్ణ ప్రకాశం వర్ణమాల రూపంలో కూర్చున్న విద్యార్థులు మినీ స్టేడియానికి మరింత శోభ తెచ్చారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగు నాగార్జున పతాకదారులను అభినందించారు. మంత్రి ఆదిమూలపు సురేష్, జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, బుర్రా మధుసూదన్ యాదవ్, కలెక్టర్ దినేష్‌కుమార్, జాయింట్ కలెక్టర్ అభిషిక్త్ కిషోర్, ఎస్పి మల్లిక గర్గ్, మేయర్ గంగాడ సుజాత, టంగుటూరి గోపాలకృష్ణ, పలువురు జిల్లా అధికారులు జాతీయ పతాకానికి సెల్యూట్ చేశారు.

వంటనూనె లూజు విక్రయాలను అనుమతించాల్సిందే!

విశాలాంధ్ర-విజయవాడ(అజిత్‌సింగ్‌నగర్) : దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్ర అధికారులు ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా సూచనల మేరకు వంట నూనెలను ప్యాకింగ్ ద్వారానే విక్రయించాలని, లూజుగా అమ్మవద్దని వ్యాపారులపై ఒత్తిడి తీసుకురావటం సరికాదని ఏపీ ఎడిబుల్ ఆయిల్స్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ అధ్యక్షులు స్వర్ణపురెడ్డి పెంచలరెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకో వాలని లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్త ఉద్యమాన్ని చేపడతామని హెచ్చరించారు. విజయవాడ గాంధీనగర్‌లోని చాంబర్ ఆఫ్ కామర్స్ అసోసియేషన్ హాల్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కల్తీ నూనెల విక్రయాన్ని అరికట్టే పేరుతో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అసంబద్ధంగా ఉందన్నారు. ప్యాకింగ్ ద్వారా మాత్రమే నూనెలు విక్రయిం చాలంటే తమ వ్యాపారం కష్టమవుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం వల్ల ప్యాకింగ్ ఖర్చు భారం ప్రజలపై పడుతుందన్నారు. కుటుంబం కోసం రోజు వారి 50మి.లీ. 100 మి.లీ. పరిమాణంలో నూనె కొనుగోలు చేసే చిన్న వినియోగదారులు ఎక్కువ మంది ఉన్నారని వారిని దృష్టిలో ఉంచుకుని ప్యాకింగ్ విషయాన్ని ప్రభుత్వం పున:పరిశీలన చేయాలని కోరారు. ఒక పక్క ప్లాస్టిక్‌ను వినియోగించవద్దని చెబుతున్న ప్రభుత్వం... మరోపక్క వంటనూనెల్ని ప్యాకింగ్‌లో మాత్రమే విక్రయించమనడం ప్రజలను మభ్యపెట్టటమే అవుతుందన్నారు. మహారాష్ట్ర, కేరళ రాష్ట్రాల్లో మినహాయింపులు ఇచ్చారని అలాగే రాష్ట్రంలో కూడా ప్యాకింగ్‌తో ఆయిల్స్ విక్రయించాలనే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. చాలా తక్కువ ధరకు లభించే పామా యిల్‌ను సామాన్యులు ఎక్కువగా వాడుతున్నారని చెప్పారు. పామాయిల్ కంటే తక్కువ ధరకు ఏ వంటనూనె లభించదని, ఇంక ఎలా కల్తీ చేస్తారని ప్రశ్నించారు. అందువల్ల పామాయిల్‌ను లూజుగా విక్రయించే అవకాశం కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో ఏపీ ఎడిబుల్ ఆయిల్స్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ కార్యదర్శి హరనాథ్, కోశాధికారి చక్రపాణి, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న హోల్‌సేల్ ఆయిల్ వ్యాపారస్తులు పాల్గొన్నారు.

ఐటీడీపీపై చర్యలు తీసుకుంటాం: ఆదిమూలపు సురేశ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్ వీడియోపై పూర్తిస్థాయి విచారణ జరిపి, దీన్ని సృష్టించిన ఐటీడీపీ వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేశ్ ఆదివారం ఓ ప్రకటలో పేర్కొన్నారు. రాష్ట్రంలో సీఎం జగన్‌కు, వైసీపీకి పెరుగుతున్న జనాదరణ చూసి టీడీపీ నాయకులకు దిక్కుతోచటంలేదన్నారు. ప్రజలు టీడీపీని తిరస్కరిస్తున్నా నేతలకు బుద్ధి రావటంలేదని, ప్రజాక్షేత్రంలో వారు మరోసారి అభాసుపాలు కాక తప్పదని అన్నారు. గోరంట్లపై టీడీపీ అనవసర రాద్ధాంతం చేస్తోందని, దమ్ముంటే ఆ వీడియో నిజమైనదేనని నిరూపించాలని సవాల్ విసిరారు. ప్రసార మాధ్యమంలో వచ్చిన వీడియో మార్ఫింగ్ చేసిందేనని స్పష్టం చేశారు. దోషులపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

1857 సిపాయిల తిరుగుబాటు

నేతాజీ 'ఆజాద్ హింద్ ఫౌజ్'


క్విట్ ఇండియా

భారతదేశపు తొలి ప్రధానిగా నెహ్రూ

సాహితి

జాతీయ పతాక

-పులుపుల వెంకటశివయ్య

జోహారులు జాతీయ పతాకా।
జోహారులు స్వాతంత్ర్య పతాకా।
త్రివర్ణ రంజిత అశోక చక్రాం
కిత పరిపూతా। జోహారుల్।
స్వతంత్ర భారత వినిర్మలాంబర
విజయ విహారీ।జోహారుల్।
బుద్ధ తపో నేత్రాంచల విలసిత ధర్మరేఖ వెలుగుల్లో
వీర కళింగ, ప్రజా హృదర్పిత, రక్తారుణ తర్పణతో,
జనియించిన ఓ శాంతి పతాకా। న్యాయము పాలిస్తానని.
వైరుల నెదిరిస్తానని లోకానికి చాటించవే।।
నీవు గరుత్మంతుడవై నింగిపైకి ఎగిరిపోయి
అరిగాపులు పెట్టబడిన అప్రమత్త యోధుని లాగున
దేశపు నలుమూలల్లో దేశావధి తీరాల్లో
పొంచియుండు శత్రులపై కాపుండవె మా కొరకై।।
నవభారత యుద్ధంలో మృతినందిన వీరులారా।
మీ త్యాగం మా కిచ్చిన యీ పతాక నీడ నిలచి
మీ యెదదల నిద్రించిన బంగారపు కలలన్నీ
మోసులెత్తి పుష్పించగ శపథమ్మిదే చేస్తున్నాం।।
చిరదాస్యపు చీకట్లో చిటిలిన మా సీమల్లో
జాతి మత ద్వేషమ్ములు మరచి ప్రజాతంత్ర రాజ్య
నవ జగతీ నిర్మాణం వివరించే సుకృతిలో
నలువది కోట్లేకమ్మై వీరులమై పోరెడమే।।
జోహారులు జాతీయ పతాక
జోహారులు స్వాతంత్ర్య పతాక।।

జాతీయగీతం 1857

ఉర్దూ రచన: మౌల్వి లియాఖత్ అలీ
తెలుగు అనువాదం:: దివి కుమార్

హిందుస్థాను
మన దేశం
దీనికి మనమే వారసులం పవిత్రమైనది మా దేశం
స్వర్గం కంటే మహాప్రియం
సమస్త సంపద మాదేలే
హిందుస్థాను మనదేలే!!
హిందుస్థాను మనదేశం
దీనికి మనమే వారసులం!
దీని వైభవం దీని ప్రాభవం
వెలుగులు చిమ్మును జగమంతా అతి ప్రాచీనం
ఎంతో ధాటి
దీనికి లేదుర
ఇలలో సాటి!!
హిందుస్థాను
మన దేశం
దీనికి మనమే వారసులం!

గంగా యమునలు పారు నిండుగా
మా నేలల్లో బంగారు పండగ
దిగువున పరుచుకు మైదానాలు
దిగ్గున ఎగసే సంద్రపుటలలు
మంచు నిండినా ఎత్తు కొండలు
కావలి దండిగ మాకు అండగా
హిందుస్థాను
మన దేశం
దీనికి మనమే వారసులం!
దూరం నుండి వచ్చిన దుష్టులు చేసిరి
కంతిరి మాయ చేష్టలు
ప్రియాతి ప్రియమవు దేశాన్నంత దోచివేసిరి రెండుచేతులా!!
హిందుస్థాను
మన దేశం
దీనికి మనమే వారసులం!

అమరవీరులు విసిరిన సవాలు దేశవాసులు వినరండి
బానిస సంకెలు తెంచండి
నిప్పుల వానై కురవండి !!
హిందుస్థాను
మన దేశం
దీనికి మనమే వారసులం!

హిందూ ముస్లిం సిక్కులందరం
ప్రియాతి ప్రియమవు సోదరులం
అదిగదిగో మన స్వతంత్ర జెండా
చేస్తాం సలాము గుండెల నిండా!!

చేస్తాం సలాము గుండెల నిండా!!

వివరణ

1857 నాటి స్వాతంత్ర్య పోరాటంలో ప్రముఖ పాత్ర నిర్వహించిన నానాసాహేబ్ పేరు మనకు బాగా తెలుసు. ఆయనకు ఆంతరంగిక కార్యదర్శి అజీమ్ ఉల్లాఖాన్, మంచి వ్యవహారదక్షుడే కాక గొప్ప యుద్ధ వ్యూహకర్త కూడా. ఆ సంగ్రామ కాలంలో ఈయన నడిపిన రహస్య పత్రిక పేరు 'పయామ్- ఎ- ఆజాదీ'. అందులో అవధ్ (లక్నో) ప్రాంతానికి చెందిన సమరయోధుడు మౌల్వీ లియాఖత్ అలీ రాసిన ఈ గేయం, ఆ రోజుల్లోనే ప్రచురితమయింది. గుంటూరు జిల్లా ఉండవల్లిలో నివశిస్తున్న సయ్యద్ నశీర్ అహ్మద్ రాసిన అనేక పుస్తకాలలో ఒకటైన 'స్వాతంత్ర్య సంగ్రామంలో ముస్లిం యోధులు' అనే పుస్తకంలో పై ఉర్దూ గేయాన్ని తెలుగు అక్షరాలలో ప్రచురించారు.

అది 2007వ సంవత్సరం. ప్రధమ భారత స్వాతంత్ర్య సంగ్రామం జరిగి 150 ఏళ్ళు. మళ్ళీ ఒకమారు వివిధ పత్రికలు ఆ పోరాటంపై తమతమ పద్ధతులలో చర్చిస్తున్నాయి. మేము 'ప్రజాసాహితి' లో దానిపైన కొన్నివ్యాసాలు ప్రచురించాము. ఒక విశిష్ట సంచికను వెలువరించాము. 2007 జూన్ నెల సంచికలో భావాన్ని, భావుకతను చెడకుండా ఈ గేయాన్ని, అనువదించి ప్రచురించాము.

మనం జాతీయ గీత రచయితలుగా చెప్పుకునే బంకించంద్ర, మహమ్మద్ ఇక్బాల్, రవీంద్రనాథ్ టాగోర్, గురజాడ, సుబ్రహ్మణ్య భారతి తదితరులు అందరికన్నా ముందుగా రాసిన, బహుశా జాతీయ గీతాలు అన్నిటిలోకి తొట్ట తొలిదైన గేయం ఇది... దివి

అమృతానందాలు!

ఎగరేయండి! ఎగరేయండి!
ఇంటింటిపై జెండా ఎగరేయండి!
ఎగరేయండి! ఎగరేయండి!
దేశమంటే మట్టికాదోయ్!
దేశమంటే మనుషులోయ్!
ఈ రెండు లైన్లు జెండా దిమ్మ
నుదిటిపై కొత్తగా రాయించండి.

కాకుంటే నాదో కండిషన్...
మేకిన్ ఇండియా కాదు రంగుడబ్బా
మేడ్ ఇన్ ఇండియా కావాలి.
జెండాకు కట్టే దారం నైలాన్ వద్దు.
స్వదేశీ జూట్ మిల్లు తయారీ తేవాలి,
జెండాలోకి గుప్పెడు పూలు కావాలి.
ప్లాస్టిక్ పూల విషం వెదజల్లొద్దు.
నీ చేతితో పెంచిన గులాబీ మొక్కలవో
వీధిలో మీ చేతుల్తో పాదు చేసి నీళ్లు పోసి
పెంచిన తురాయి పువ్వులో అయి ఉండాలి.
ఎగరేయండి! ఎగరేయండి!
ప్రతి ఇంటా ఓ జెండా ఎగరేయండి!

ఏ అప్పులూ లేని మీ సొంత ఇంటిపై మాత్రమే
సగర్వంగా జెండా ఎగరేయండి.
ఇళ్ళు లేనోళ్లంతా ఇళ్లు కావాలని
మీ మెడలో ఒక బోర్డు తగిలించుకొని
ఎగరేయండి! జెండా ఎగరేయండి!

కౌలు భూములు కానీ, తాకట్టులో లేని
మీ సొంత పొలంగట్లపై కూడా ఎగరేయండి!
ఒక్కసెంటైనా భూమి లేని వాళ్లంతా
గుంపులు గుంపులుగా వెళ్లి
ఊరికి ఉత్తరాన స్మశానంలో ఎగరేయండి.

దింపుడు కల్లంలో నిలబడి
75 ప్రదక్షిణలు చేయండి.
దేశమంటే మట్టికాదోయ్!
జెండాకు సెల్యూట్ చేయండి.
దేశమంటే మనుషులోయ్!
అంటూ గురజాడ గీతాన్ని బిగ్గరగా ఆలపించండి.

జెండా గాల్లో ఎగిరితేనే సరిపోదు మిత్రమా!
జనం గుండెల్లో కూడా ఎగరాలి.
ఎగరేయండి! ఎగరేయండి! జెండా ఎగరేయండి!

ఉసూరుమంటున్న ఐడిపిఎల్
మొండి గోడలపై ఎగరేయండి.
పనిలోపనిగా పాడుబడ్డ
ఉస్మానియా హాస్పిటల్‌పై మొలచిన
మర్రి చెట్టుక్కూడా ఒక జెండా కట్టండి.

మర్చిపోకండి సార్లూ....
మీ కాన్వాయ్ ఆ దారిన పోయేటప్పుడు
ఒక్కసారి తలెత్తి చూడండి.
రంగు లేక వెలవెల బోతున్న
బిఎస్ఎన్ఎల్ బిల్డింగ్ పై కూడా
రంగుల జెండా ఎగరేయండి.

ప్రజలారా!
మీ రక్తం చెమటలతో నిర్మించుకున్న
రైల్వేస్టేషన్లలో బస్టేషన్లలో రోడ్ల పొడవునా
రైలు పట్టాలకటూ ఇటూ
రక్షణ జెండాలు ఎగరేయండి!

వందేళ్ల సంబురాలదాకా బతకనిస్తరో లేదో
ఇంటింటా ప్రతిజ్ఞ చేసి రక్షించుకుంటామని
వందల జెండాలు ఎగరేయండి!

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ముందు
ఉక్కు సంకల్ప జెండా ఎగరేయండి!

నవరత్నాలను కాపాడుకుంటామని
9అడుగుల పోరాట జెండాలెగరేయండి!

అమ్ముడుపోని ధాన్యపు రాశుల ముందు
రైతు తలపాగా జెండాగా ఎగరేయండి.
ఆ నిరసన జెండాలో ...
నవధాన్యాలూ మూటగట్టి ఎగరేయండి.
మరోవందేళ్ల విత్తనాల్ని కాపాడుకుంటామని.
ఎగరేయండి! ఎగరేయండి! జెండా ఎగరేయండి!

నదులమీదా సముద్రతీరాల పొడవునా
అడవిలో చెట్టు చెట్టుపై ఎగరేయండి!
రేపటికి ఏవి మిగులుతాయో
ఏవి కనుమరుగవుతాయో.
ప్రతి చెట్టుకి కాపలాగా పెట్టండి జెండాకర్రను
ఎగరేయండి! జెండాను ఎగరేయండి!

అన్నింటికన్నా దేశభక్తితో...

అగ్నివీరుల ఆధునిక చేతులతో
ఆకాశమంత ఎత్తు జెండాలు దేశ
సరిహద్దుల పొడవునా ఎగరేయండి!

ఎగరేయండి జెండా ఎగరేయండి
కనిపించకుండా పోయిన చెరువుల జ్ఞాపకార్థం
స్మారక స్తూపాలు కట్టి వాటి పలకలపై
'ఇక్కడ ఒక ఆకుపచ్చని సమాజం ఉండేది'
అని రాసి పక్కనే ఒక జెండా ఎగరేయండి!

మర్చిపోకండి మిత్రమా! మర్చిపోకండి.
బలవన్మరణానికి బలైన లక్షల రైతులను
మనసునిండా స్మరిస్తూ రెండు నిమిషాలు
మౌనం పాటించడం మర్చిపోకండి.

ఎగరేయండి జెండా ఎగరేయండి
మూతబడ్డ ప్రతి స్వదేశీ ఫ్యాక్టరీ
పొగ గొట్టాన్నీ వెతికి తెచ్చి
పేరు పేరునా సంతాపజెండా ఎగరేయండి.

ఉపాధి కోల్పోయిన కార్మికులంతా
ఒక నిమిషం నిశ్శబ్దంగా ...
ఎగిరే జెండా ముందు నిలబడండి చాలు
బహుళజాతి బూట్లచప్పుడు వినిపిస్తుంది.
ఎగరేయండి! ఎగరేయండి!
ఇప్పుడే ఎగరేయండి!
రేపటి రోజున.. ఏదేశంలోనైనా
ఎగరవేయడానికి జెండా దిమ్మెలు
ఇళ్ళూ వాకిళ్ళు స్కూళ్ళు సినిమాహాళ్లు
శిథిలాలుగా మారచ్చు ఉక్రెయిన్ లా..
సామ్రాజ్యవాదుల యుద్ధాల బీభత్సాన్ని తలుచుకుని
మీ పిల్లలతో ఎగరేయించండి.
ఎగరేయండి! జెండా ఎగరేయండి!

నూరేళ్ల పండుగ నాటికి
ఎగరేయడానికి మీ చేతిలో తాడూ
మీటరు జెండాగుడ్డనూ కొనలేకపోవచ్చు
ఇప్పుడే ఎగరేయండి! ఎగరేయండి!

పది అడుగులు ఎత్తులో ఎగిరే జెండాను
దాలరు ఎనభైకి దిగిన రూపాయి సంకేతంగా
ఎనిమిదడుగులు అవనతం చేయండి!
అపుడు మీకేమనిపిస్తుంది?
నాకైతే తల తెగి నేలపై పడ్డట్టనిపిస్తుంది.

జెండా అంటే...
మూడడుగుల గుడ్డముక్క కాదని
తరతరాల ఆత్మగౌరవమనిపిస్తుంది.
దేశమంటే.. మట్టికాదని
దేశమంటే... మనుషులనీ తెలుస్తుంది.

-పినాకిని

వందనం వజ్రోత్సవ భారత్!!

-వి.ఎస్.ఆర్.ఎస్.సోమయాజులు, సెల్: 9441148158

నేడు అబ్బురంగా
అమృతోత్సవ భారతంలో
మువ్వన్నెల క్రాంతిచ్ఛటలు
నింగీ- నేలా నడుమ విస్తరిస్తున్నాయి.
ఎన్నెన్నో పోరాటాలు - బావుటాలు
పరదాస్యపు శృంఖలాల్ని నిర్జించాలి
గర్జించిన ఆత్మ బలిదానాలైనాయి
నాటి- వైతాళికుల త్యాగాల స్వప్నం
నేటి- సాఫల్య సాకారాల వరమయ్యింది.
"భిన్నత్వంలో ఏకత్వం"
నినాదం కారాదు- ఆశయాల కరదీపికలు
నిజాచరణల్లోని నిజాయితీని
చాటే ఏలికలు- పాలితులకు వరాలవ్వాలి.
కోట్లాది స్వేచ్ఛా భావనలు హరించే
రంగుల ఎజెండాలు - పరాయీకరణాలకు
దార్లు తెరిచే యత్నాల్ని నిలువరించాలి.
స్వావలంబనల్లో- సుపరిపాలనల
కార్య సాఫల్యాలకు ప్రతీకగా నిలవాలి
అజాదీకా అమృతోత్సవాల సంబరాలు- అంబరాన్నంటేలా
"తిరంగా ప్యారా"-
ఝుండా ఊంఛా రహే హమారా!!

అమృత ఘడియల్లో !

అందినవన్నీ అమ్మేసుకోవడానికి
మేం ఎప్పుడో సిద్ధమై పోయాం !
కనబడ్డవన్నీ కబ్జా చేయడానికి
మేం ఎప్పుడో అలవాటు పడ్డాం!
దేశంలో సంస్కృతిని సంపదలనూ
దేహంలో సిగ్గునీ శీలాన్నీ !
ఇప్పటికే అమ్మేసాం!

ఒంట్లోని విలువలు ఇంట్లోని వస్తువులూ
చేతిలోని ఇల్లు పొలాలు ఓట్లు అమ్మేసుకోవడానికి
మీరూ అలవాటు పడ్డారుగా!
ఇంకేం! ఎవరేమనుకుంటే మనకేం?
దేశ ప్రజలారా! రండి! కలసి అమ్మేసుకుందాం!
వచ్చిందేదో పంచేసుకుందాం!
ఈ బృహత్తర యజ్ఞంలో మీరూ మాతో భాగస్వాములు కండి !
మేం! దేశాన్ని ,దేశ రహస్యాలను అమ్మేస్తాం!
అమృత ఘడియలు దాటకుండానే
ఈసారికి మీరు దేశ పతాకాలను అమ్మేయండి!
దేశ పటాలనూ దేశమాత చిత్రాలనూ బేరంపెట్టండి !

మీ అర్జనను మళ్లీ మాకే పెట్టుబడిగా పెట్టండి
మాతో చేయి చేయి కలసి నడవండి !
దేశాభివృద్ధికి సహకరించండి! దేశ కల్యాణానికి పాటు పడండి!
జైహింద్!

'వసుధ'

వజ్రోత్సవ స్వాతంత్ర్యం...!

పసిడి సిరులు కురిపించే నాదేశం
స్వాతంత్ర్య వజ్రోత్సవాలా వేళ...
మృదు లతల సోయగాలు ఎక్కడ
హిమశికర పాలవెన్నెల కాంతులేవి

కోహినూర్ వజ్రం వంటి నా దేశంలో
సకల కళా సాంస్కృతక వైభవం ఏది
పుణ్యభూమిలో ప్రగతి దారులెక్కడ

విశ్వ శిఖరంపై త్రివర్ణ పతాకం స్థానం
దిగంబర రహస్యమై ఏమూలనుందో

త్యాగాల సమాధులపై కడుతున్న
సామ్రాజ్యాలు నిండా శవాల కంపే

అత్తెసరు బతుకులన్ని అత్తరు పూసి
కాలం వెళ్లదీస్తుంటే...! ఉన్నోళ్ళంతా
పన్నీరు పూసుకుని పల్లకిలో షికార్లు

ఇప్పుడు పాలకులు పాలికాపులై
దొరగారి పల్లకిమోస్తుంటే... నా దేశ
జాతీయ జెండా పల్లకీపై మొదో రింది
స్వాతంత్ర్యం...వజ్రోత్సవాలు వేళ
అత్తెసరుబతుకులు... ఒక్కొక్కటి
ముడేసి....మోకులవ్వాలి ....
భస్మాసుర పాలన పై సూలమవ్వాలి

రెడ్డి శంకరరావు, 9494333511

ఏమున్నది గర్వకారణం...!

స్వాతంత్ర్యం సిద్ధించి
ఏడు పదులాయె
పేదల కష్టాలు తీరలేదాయె
పరాయి పాలనలో
బతుకు బానిసాయె
స్వపాలనలో స్వరం పెగలదాయె
అడుగడుగునా అణచివేతాయె
పెదవి విప్పితే లాఠీ నాట్యమాడె

గిరిగూడేలు చూసినా
ఏమున్నది గర్వకారణం

గొంతు తడుపుదామన్నా
గుక్కెడునీరు గగనమాయె
దారీతెన్నూ లేదాయె
బతుకంతా దోలీపాలాయె

ఆకాశాన ధరలాయె

దించేవారే లేరాయె
డొక్క నింపుదామంటె
గుప్పెడన్నం దొరకదాయె
మత్తు మందు ఫుల్లాయె
మంచినీరు నిల్లాయె
దగాకోరుల దోపిడీ
అడ్డుకునేవారే లేరాయె
నిలువరిద్దామంటే
ప్రభుత్వాలు కూలిపోయె
పాలకులు మారరాయె
భరతమాత కంటనీరు
జలపాతమాయె!

గోల్కొండ బాబూరావు

గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల విశాలాంధ్ర విలేఖరుల బృందం

వి.యల్. నరసింహారావు ఇన్‌ఛార్జ్ : గుంటూరు, బాపట్ల, పల్నాడు సెల్ : 9848734987	షేక్ రాజా సాహెబ్ గుంటూరు సెల్ : 9966356150	కొంగర వెంకయ్య గుంటూరు సెల్ : 8501031031	కొండెపాటి సుజిబాబు గుంటూరు సెల్ : 8919891715	రేపూడి శ్రీనివాసరావు తాడికొండ సెల్ : 9618075499	కె. రత్నాకర్ ఫిరంగిపురం సెల్ : 9985736354
బత్తుల సోమశేఖర్ మేడికొండూరు సెల్ : 9441502788	తుడిమెల్ల రాంబాబు తాడేపల్లి సెల్ : 9533861870	కాగితాల ప్రకాష్ దుగ్గిరాల సెల్ : 8919443684	బి. వెంకటేశ్వరరావు పొన్నూరు సెల్ : 9346943668	కొంగర లక్ష్మణరావు పెదకాకాని సెల్ : 9866243637	కోడిరెక్క కోటిరత్నం ప్రత్తిపాడు సెల్ : 9866422911
రామిశెట్టి ఆదేశ్వరరావు పెదనందిపాడు సెల్ : 8341601248	బొల్లిముంత కృష్ణ తెనాలి సెల్ : 9959431235	తొల్లికొండ రవి వట్టిచెరుకూరు సెల్ : 8008983450	ఎ.కె. మోహన్ నరసరావుపేట సెల్ : 9440259136	అర్రూరి రమేష్ నరసరావుపేట రూరల్ సెల్ : 9441176878	పాదర్తి రమేష్ రొంపిచర్ల సెల్ : 9030316774
ఏలూరి వెంకట ధనుంజయ చంద్రశేఖర్ నకరికల్లు సెల్ : 9963524524	యార్లగడ్డ చంద్రశేఖర్ ఆజాద్ వినుకొండ సెల్ : 9440703647	పఠాన్ గౌస్ ఖాన్ బొల్లాపల్లి సెల్ : 9959436582	దేవిశెట్టి బాలకోటేశ్వరరావు ఈపూరు సెల్ : 9177651306	కంచర్ల సుబ్బరామయ్య నూజెండ్ల సెల్ : 9490763999	పొత్తూరి వెంకట పూర్ణచంద్రరావు శావల్యాపురం సెల్ : 9441503108
బైరాపట్నం రామకృష్ణ అమరావతి సెల్ : 9014322462	తెళ్ళ రాజు పెదకూరపాడు సెల్ : 9032067783	మునగోటి శ్రీనివాసరావు పెదకూరపాడు రూరల్ సెల్ : 9502742112	రొంపిచర్ల రామచంద్రప్రసాద్ క్రోసూరు సెల్ : 9618561042	సి.హెచ్. రమేష్ సత్తెనపల్లి సెల్ : 9440383782	బి. శ్రీనివాసరావు ముప్పాళ్ళ సెల్ : 9494609438
వజ్రాల వెంకటేశ్వరరెడ్డి బెల్లంకొండ సెల్ : 9948004952	వసంతపు తిరుపతిరావు రాజుపాలెం సెల్ : 9866374146	చేపూరి వీరేంద్రకుమార్ కారంపూడి సెల్ : 9963182030	పేరం చెన్నారెడ్డి రెంటచింతల సెల్ : 9948119494	కొంగల వెంకటేశ్వర్లు దుర్గి సెల్ : 967600307	పువ్వాడ అమర శివప్రసాద్ దాచేపల్లి సెల్ : 9985646999
మోమిన్ సైదా సాహెబ్ దాచేపల్లి రూరల్ సెల్ : 9848888196	పఠాన్ జాన్ ఖాన్ మాచర్ల సెల్ : 8341019565	యలిశెట్టి నాగేశ్వరరావు మాచవరం సెల్ : 9703308970	వై. రామచంద్రారెడ్డి వెల్దుర్తి సెల్ : 9963850400	జంపుల శ్రీనివాసరావు గురజాల సెల్ : 9701409017	షేక్ అల్లాభక్షు చిలకలూరిపేట సెల్ : 9290592576
షేక్ మహబూబ్ సుభాని విజయపురి సౌత్ సెల్ : 9492943175	కాగిత ప్రశాంతరాజు బాపట్ల ఇన్‌ఛార్జ్ సెల్ : 9618198627	బుర్రా ఆంజనేయులు బాపట్ల సెల్ : 9866751261	వి. రవిప్రసాద్ వేమూరు సెల్ : 9959945439	గొట్టిముక్కల బాలాజీ భట్టిప్రోలు సెల్ : 9866135225	షేక్ బాజీ నిజాంపట్నం సెల్ : 8121753321
గూడూరు రమేష్‌బాబు రేపల్లె సెల్ : 9705609400	తలాడి శేషగిరిరావు చెరుకుపల్లి సెల్ : 9059160909	షేక్ మహ్మద్ నూరుల్లా కొల్లూరు సెల్ : 9885160594	ఎ. మల్లిఖార్జునరావు విలేఖరి సెల్ : 9704046567	సర్క్యులేషన్ & కార్యాలయ సిబ్బంది, విశాలాంధ్ర (గుంటూరు, పల్నాడు, బాపట్ల)	

తిరుపతి సభలో అభివాదం చేస్తున్న నారాయణ, రామకృష్ణ, హరినాథరెడ్డి, రామానాయుడు, మురళి, ప్రభాకర్, విశ్వనాథ్, నాగరాజన్, జయలక్ష్మి, పెంచలయ్య తదితరులు

స్వాతంత్ర్య పోరాటంలో

కమ్యూనిస్టుల రక్త తర్పణం

- బ్రిటీషు వారికి ఊడిగం చేసిన ఆర్ఎస్ఎస్: సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ
- అసాంఘిక శక్తులకు నిలయం వైసీపీ సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ
- ఉత్సాహంగా సీపీఐ తిరుపతి జిల్లా మహాసభలు ప్రారంభం

విశాలాంధ్ర-తిరుపతి బ్యూరో: దేశ స్వాతంత్ర్య ఉద్యమంలో రక్త తర్పణం అర్పించి, ప్రాణ త్యాగాలు చేసిన ఘన చరిత్ర కమ్యూనిస్టులదని సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ అన్నారు. బ్రిటీషు వారికి ఊడిగం చేసిన ఘనత ఆర్ఎస్ఎస్‌కు దక్కుతుందని విమర్శించారు. సీపీఐ తిరుపతి జిల్లా ప్రథమ మహాసభలు ఆదివారం సాయంత్రం ప్రారంభమయ్యాయి. తిరుపతి మున్సిపల్ కార్యాలయం నుంచి బయలుదేరిన మహాప్రదర్శన సెంట్రల్ పార్క్, మున్సిపల్ మార్కెట్, వైఎస్సార్ విగ్రహం సర్కిల్ మీదుగా ఇందిరా మైదానానికి చేరుకుంది. ర్యాలీలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రజా వ్యతిరేక విధానాలపై కార్యకర్తలు చేసిన నినాదాలతో తిరుపతి నగరం దద్దరిల్లింది. ప్రదర్శనలో రెడ్ షర్టు వలంటీర్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి, డప్పు కళాకారులు ఉద్యమ గేయాలతో ప్రజానీకాన్ని ఆలోచింప చేశారు. అనంతరం ఇందిరా మైదానం (వసుమతి దేవి ప్రాంగణం)లో జరిగిన బహిరంగ సభకు సీపీఐ నగర కార్యదర్శి విశ్వనాథ్ అతిథులను వేదిక మీదకు ఆహ్వానించారు. ఈ సభకు తిరుపతి జిల్లా కార్యదర్శి పి.మురళి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరయిన డాక్టర్ కె.నారాయణ మాట్లాడుతూ ఆజాదీ కా అమృత మహోత్సవంలో భాగంగా దేశ వ్యాప్తంగా ఇంటింటికీ జెండా పేరుతో జెండాల వ్యాపారం చేస్తూ కార్పొరేట్ కంపెనీల లాభాల కోసం పాటుపడుతున్నారని ధ్వజమెత్తారు. ఖాదీ పరిశ్రమలను ప్రోత్సహించకుండా చేనేత కార్మికుల కడుపు కొట్టి చైనా కంపెనీకి అప్పగించడం దారుణం అన్నారు. 14 మంది దేశ ప్రధానులు అనేక ప్రభుత్వ రంగ సంస్థలను నెలకొల్పితే, మోదీ 8 ఏళ్ల పరిపాలనలో 24 ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వారికి అప్పనంగా దారాదత్తం చేశారని విమర్శించారు. రాజ్యాంగబద్ధంగా నడుస్తున్న వివిధ సంస్థలను తన కనుసన్నల్లో పెట్టుకుని ప్రజాస్వామ్య వ్యవస్థను అపహాస్యం చేస్తున్నారని మండి పడ్డారు. బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు వామపక్ష, ప్రజాతంత్ర, లౌకిక శక్తులు ఏకం కావాలని నారాయణ కోరారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ హంతకులు, అసాంఘిక శక్తులకు నిలయంగా వైసీపీ మారిందని విమర్శించారు. ఎంపీ మాధవ్ న్యూడ్ వీడియో పై ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి మౌన మునిలా వ్యవహరించడం సిగ్గుచేటు అన్నారు. ఈ ఘటనపై హోం మంత్రి, పోలీసు అధికారులు ఆ వీడియోను ఫోరెన్సిక్‌కు పంపామని, అసలు వీడియో లేదని చెప్పడం ఘోరం అన్నారు. దళిత డ్రైవర్‌ను హతమార్చి శవాన్ని ఇంటికి చేర్చిన ఎమ్మెల్సీ అనంత బాబు ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేయడం చూస్తే వైసీపీ హంతకులకు అండగా నిలుస్తోందన్నారు. 151 సీట్లు ఇస్తే ఒక్క ప్రాజెక్టు తీసుకురాని జగన్ 175 టార్గెట్ అనడం ఏమి సాధించడానికి అని ఎద్దేవా చేశారు. కేసులకు భయపడి, మోదీకి మోకరిల్లుతూ రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తున్నారని ధ్వజమెత్తారు. విదేశాల నుంచి ఒక పరిశ్రమ కూడా తీసుకురాలేకపోయారని అన్నారు. ప్రస్తుతం రాష్ట్రానికి రూ.8.36 లక్షల కోట్ల అప్పులు ఉన్నాయని, జగన్ దిగిపోయే నాటికి అవి రూ.10 లక్షల కోట్లకు చేరడం ఖాయమన్నారు. చేసిన అప్పులు ఏ అభివృద్ధి పనుల కోసం ఖర్చు చేశారో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పి.హరినాథ రెడ్డి మాట్లాడుతూ తిరుపతిలో కమ్యూనిస్టు పార్టీ చారిత్రాత్మక ఉద్యమాలు చేసిందని, అలాంటి పార్టీ మహాసభ జరుగుతుండగా అధికార పార్టీ నాయకులు, అధికారులు పార్టీ జెండాలు, తోరణాలు తొలగించడం దారుణం అన్నారు. స్థానిక ఎమ్మెల్యే, మేయర్, కమిషనర్ అనుమతి తీసుకున్నప్పటికీ తొలగించడం ఏమిటని ప్రశ్నించారు. జిల్లాలో ప్రాజెక్టులను పూర్తిచేయడంలో వైసీపీ విఫలమైందన్నారు. పాఠశాలల విలీనం పేరుతో పేద విద్యార్థులను చదువులకు దూరం చేస్తోందన్నారు. చెత్త పన్ను, విద్యుత్ ట్రూ అఫ్ చార్జీల పేరుతో ప్రజలపై భారం మోపిందని విమర్శించారు. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన తిరుపతి జిల్లా సమగ్రాభివృద్ధి కోసం సీపీఐ అధ్వర్యంలో ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. చిత్తూరు జిల్లా కార్యదర్శి నాగరాజన్, మహిళా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు జయ లక్ష్మి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ప్రభాకర్, జిల్లా కార్యవర్గ సభ్యులు పార్థ సారథి, రామచంద్రయ్య, గురవయ్య, బాలకృష్ణ, రమణ, కుమార్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చెంచమ్మ, నదియా, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శివారెడ్డి, కార్యవర్గ సభ్యులు శశి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు చలపతి, ఉదయ్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, రవి, డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి మారెళ్ల శ్రీనివాసులు, దళిత హక్కుల పోరాట సమితి అధ్యక్ష, కార్యదర్శులు నాగభూషణం, కాలయ్య, చేతి వృత్తిదారుల సంఘం కార్యదర్శి రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు. ప్రజా నాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగరాజు, రవి, గుర్రప్ప, సుబ్రమణ్యం, సూరి, గురవయ్య, నాగభూషణం సభా వేదిక పై ఆడి, పాడిన ఉద్యమ గేయాలు సభికులను ఆకట్టుకున్నాయి.

మోదీ, జగన్‌ది ప్రజాకంటక పాలన

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

మాట్లాడుతున్న ముప్పాళ్ల. వేదికపై రావుల, మధు, రవి, సత్తిబాబు తదితరులు

విశాలాంధ్ర - అమలాపురం: కేంద్రంలో నరేంద్ర మోదీ, రాష్ట్రంలో జగన్ ప్రజాకంటక పాలన సాగిస్తున్నారని సీపీఐ రాష్ట్ర సహాయకార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సీపీఐ మహాసభల ముగింపు కార్యక్రమానికి అతిథిగా విచ్చేసిన ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ...మోదీ ప్రభుత్వం చేపట్టిన ఆర్థిక విధానాల కారణంగా నిరుద్యోగం తీవ్రమైందని పేర్కొన్నారు. జీఎస్టీ, నోట్ల రద్దు వంటి వినాశకర ఆలోచనలతో దేశాన్ని ఆర్థికంగా దివాళా తీయించి ఆ తప్పులను కప్పి పుచ్చుకోవడం కోసం జాతీయ జండాను అడ్డం పెట్టుకుంటున్నారని దుయ్యబట్టారు. అమృత మహోత్సవాల పేరుతో చేస్తున్నది వట్టి ఆర్భాటమేనని పేర్కొన్నారు. దేశంలో ఉద్యోగాలు లేక, నివాసాలు లేక కోట్ల మంది ప్రజలు బాధలు పడుతున్నది ఈ ప్రభుత్వాలకు కనిపించదా అని సూటిగా ప్రశ్నించారు. దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో బీజేపీ, సంఘ్ పరివార్ శక్తుల పాత్ర లేదని గుర్తు చేశారు. అయినా తామే దేశ భక్తులం అని ఎలా చెప్పుకుంటారని ప్రశ్నించారు. ప్రజలపై పన్నుల భారం మోపుతూ... సంపదల్ని కార్పొరేట్ శక్తులకు మోదీ ప్రభుత్వం కట్టబెడుతోందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో జగన్ నియంత తరహా పాలన సాగిస్తున్నారని పేర్కొన్నారు. అభివృద్ధి శూన్యమని చెప్పారు. ప్రశ్నించే శక్తులపై కక్ష పూరిత దోరణితో ఏపీ ప్రభుత్వం వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. ఈ నేపథ్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను అధికార పీఠం నుంచి దించాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఈ క్రమంలోనే అక్టోబరు 14 నుంచి ఐదు రోజుల పాటు విజయవాడ నగరంలో సీపీఐ జాతీయ మహాసభలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు. సీపీఐ అత్యంత ప్రజాస్వామ్యం కలిగిన పార్టీ అని పదవులకోసం పాకులాడే వారు పార్టీలో ఉండరని చెప్పారు. ప్రజా ఉద్యమాలే నాయకుల్ని తయారు చేస్తాయని పేర్కొన్నారు. పార్టీని బలోపేతం చేయడం కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఏఐకేఎస్ జాతీయ అధ్యక్షులు రావుల వెంకయ్య మాట్లాడుతూ ఇతర రాజకీయ పార్టీలకు భిన్నంగా సీపీఐ పని చేస్తుందని చెప్పారు. పాలక పక్షాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై కలసి వచ్చే శక్తులతో కలసి పని చేయాల్సి ఉంటుందని చెప్పారు. అక్టోబర్ 14న విజయవాడలో జరిగే మహా ప్రదర్శనకు లక్షలాదిగా తరలివచ్చి పార్టీ శక్తిని ప్రదర్శించాలని, అరుణ పతాకాలతో విజయవాడ నగరం దద్దరిల్లిపోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు మాట్లాడుతూ సీపీఐని ప్రజా క్షేత్రంలో మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఇందులో భాగంగానే ప్రజా సంఘాల నిర్మాణంపై దృష్టి సారించాలని సూచించారు. ఈ సభకు బి రవి అధ్యక్షత వహించగా జిల్లా కార్యదర్శి కె సత్తిబాబు, చెల్లుబోయిన కేశవ శెట్టి, చెలికాని స్టాలిన్, రమణి, వాసంశెట్టి సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కార్యదర్శిగా సత్తిబాబు



డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా సీపీఐ కార్యదర్శిగా కె.సత్తిబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం ఈదరపల్లి అంబేద్కర్ కమ్యూనిటీ హాల్లో జరిగిన జిల్లా మహాసభల్లో సత్తిబాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయనతో పాటు పి రాము, శీలం వెంకటేష్, సిహెచ్ తాతారావు, జి రవి, రేవు వరలక్ష్మి, జి చిరంజీవి, నిమ్మకాయల శ్రీనివాస్‌రావులను జిల్లా కార్యవర్గ సభ్యులుగా, 29 మందిని సమితి సభ్యులుగా ఎన్నుకున్నారు.

స్వర్ణకారుడి నైపుణ్యం

0.400 మిల్లీ గ్రాముల బంగారంతో 'సూక్ష్మ ఇండియా' పటం

విశాలాంధ్ర - గణపవరం: స్వర్ణకారుడు పేరూరి వేణు గోపాలకృష్ణ (గణపవరం) తనకున్న అద్భుత కళా నైపుణ్యంతో 0.400 మిల్లీ గ్రాముల బంగారంతో 'సూక్ష్మ ఇండియా' పటం తయారు చేశారు. దేశభక్తితోనే తన కళానైపు ణ్యాన్ని జోడించి 'సూక్ష్మ ఇండియా' పటం తయారు చేసినట్లు కృష్ణ తెలిపారు. గతంలో కూడా ఇండియా జెండా, రాట్నం, 0.020 మిల్లీ గ్రాముల బంగా రంతో అద్దాలు కలిగిన గాంధీ కళ్లజోడు ప్రతిభతో తయారు చేసి దేశభక్తిని చాటుకున్నారు. ఈ సందర్భంగా స్వర్ణకారుడు కృష్ణను రుద్రరాజు ఫౌండేషన్ చైర్మన్ ఆర్‌వీఎస్ రాజు, గణపవరం ఎంపీపీ దండు వెంకటరామరాజు (అర్ధవరం రాము), సర్పంచ్ మూర అలంకారం, కాకర్ల విష్ణు శ్రీనివాసరావు, వైయస్సార్ సీపీ కన్వీనర్ దండు రాము అభినందించారు.

దేశ భక్తుల భూమి ఆంధ్రప్రదేశ్

గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వేడుకలలో భాగంగా సర్వోదయ ట్రస్ట్ నేతృత్వంలో విజయవాడ మహాత్మా గాంధీజీ 30 అడుగుల కుడ్య చిత్ర విగ్రహాన్ని ఆదివారం గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ... గాంధీ మహాత్ముడు దేశాన్ని స్వాతంత్ర్యం వైపు నడిపించడం తోపాటు, ప్రపంచవ్యాప్తంగా స్వాతంత్ర్య పోరాటాలు, హక్కుల ఉద్యమాలకు ప్రేరణగా నిలిచారన్నారు. మహాత్మా గాంధీ... దండి మార్చ్, క్విట్ ఇండియా ... ఇలా చాలా ఉద్యమాలకు రూపకల్పన చేసి ప్రపంచానికి మార్గదర్శిగా నిలిచారని వివరించారు. దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లయిన తరుణంలో దేశభక్తికి ప్రేరణగా 'హర్ ఘర్ తిరంగ' కార్యక్రమం అమలవుతోందన్నారు. ఈనెల 15 వరకు ప్రతి ఒక్కరూ తమ నివాసాలపై జాతీయ జెండాను ఎగురవేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సర్వోదయ ట్రస్ట్... స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులు, భావసారూప్యత కలిగిన సామాజిక కార్యకర్తలు, పరోపకారుల భాగస్వామ్యంతో పని చేయడం ముదావహమన్నారు. సుప్రసిద్ధ స్వాతంత్ర్య సమరయోధుడు గద్దె లింగయ్య పేరు మీద ఒక గ్రంథాలయం నిర్వహించటం గర్వించదగ్గ విషయమన్నారు. ఆంధ్రప్రదేశ్ స్వాతంత్ర్య వీరుల, దేశభక్తుల భూమి అని ఆయన కొనియాడారు. పింగళి వెంకయ్య, కన్నెగంటి హనుమంతు, కందుకూరి వీరేశలింగం పంతులు, పొట్టి శ్రీరాములు వంటి స్వాతంత్ర్య సమరయోధుల సేవలు ఎన్నటికీ మరువలేనివని గవర్నర్ కొనియాడారు. రాష్ట్ర పర్యాటక, భాషా సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ భార్గవ మాట్లాడుతూ... కృష్ణాజిల్లా స్వాతంత్ర్య సమరయోధుల సంఘం భవనం దాతృత్వవేత్తలు, మాజీ పార్లమెంటు సభ్యులు, ఇతరుల విరాళాలతో నిర్మితమై 1986లో నాటి రాష్ట్రపతి జ్ఞాని జైల్ సింగ్ చేతుల మీదుగా ప్రారంభమైందన్నారు. భారత మాజీ రాష్ట్రపతి వెంకటరామన్ సహా వివిధ ప్రముఖులు ఈ ప్రాంతాన్ని సందర్శించారని వివరించారు. సర్వోదయ ట్రస్టు అధ్యక్షుడు జీవీ మోహన ప్రసాద్ మాట్లాడుతూ... 1995లో సర్వోదయ ట్రస్ట్ స్థాపించబడిందని గాంధీ విజ్ఞాన మందిర నిర్వహణతో పాటు విద్య, పర్యాటక ఆకర్షణల ప్రదేశంగా దీనిని మరింత అభివృద్ధి చేస్తున్నామన్నారు. వేడుకల్లో భాగంగా స్వాతంత్ర్య సమర యోధులు, వారి కుటుంబ సభ్యులను గవర్నర్ సన్మానించారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. ఎన్టీఆర్‌జిల్లా కలెక్టర్ డిల్లీ రావు, మాజీ మంత్రి మండలి బుద్ధప్రసాద్, స్వాతంత్ర్య సమర యోధురాలు మనోరమ, ట్రస్ట్ సభ్యుడు డాక్టర్ ఎంసీ దాస్, సీనియర్ సిటిజన్ల అసోసియేషన్ అధ్యక్షుడు మోతుకూరి వెంకటేశ్వరరావు, స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబ సభ్యులు, విజయవాడ నగర ప్రముఖులు పాల్గొన్నారు.

విద్వేష రాజకీయాలకు ఓటమి తప్పదు: కాంగ్రెస్

న్యూఢిల్లీ: విద్వేష రాజకీయాలకు ఓటమి తప్పదని, ఐక్య భారతం కోసం కాంగ్రెస్ కసరత్తు కొనసాగుతుందని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ అన్నారు. విభజన నాటి భయానక ఘటనల స్మారక దినాన్ని పురస్కరించుకొని నాటి మృతులకు ప్రధాని మోదీతో పాటు బీజేపీ అగ్రనేతలు నివాళులర్పించడాన్ని కాంగ్రెస్ విమర్శించింది. రాజకీయ పోరాటాలకు విభజన నాటి బాధాకర ఘటనలను 'మేత'గా బీజేపీ వాడుతోందని, ఈ దినాన్ని పాటించడం వెనుక బీజేపీ వాస్తవ ఉద్దేశం అని కాంగ్రెస్ దుయ్యబట్టింది. దేశంలో విద్వేషాన్ని, వివక్షను రెచ్చగొట్టేందుకు విభజనను దుర్వినియోగిస్తోందని జైరాం రమేశ్ అన్నారు.